RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:245 శుక్రవారం 23అక్టోబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

కుల గణనలో తప్పులుంటే సరిచేస్తాం

- కులాల వారీగా తప్పులు, గణాంకాల్లోకి రాని వారి వివరాలు ఇవ్వండి
- రాబోయే కేబినెట్ భేటీలో కుల గణనపై ప్రత్యేక చర్చ
- ముదిరాజులను బీసీ-ఏలో చేర్చే అంశంపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు
- ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపుపై పీసీసీని ఒప్పించే బాధ్యత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు
- ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమరయ్య, పండుగ సాయన్న విగ్రహాల ఏర్పాటు
- రవీంద్రభారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 22:

తెలంగాణలో సమగ్ర కుల గణన లెక్కల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏ కులానికి చెందినవారైనా గణాంకాల్లో తప్పులున్నాయని భావిస్తే, లెక్కల్లోకి రాని వారి వివరాలను ప్రభుత్వానికి అందించాలని కోరారు. వాటిని పరిశీలించి అవసరమైన మార్పులు చేస్తామని, రాబోయే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ పాలన తర్వాత

మిగతా 2వ పేజీలో..

కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన..

- రూ.110 కోట్లతో ఆలయ అభివృద్ధి
- దసరా వేళ సొంత నియోజకవర్గంలో పర్యటించిన ముఖ్యమంత్రి

2

- తిరుమల తరహాలో కొండగల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి



‘వికసిత భారత్’ సాధనే లక్ష్యం కావాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- అలాయ్ బలాయ్ వేదికగా పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 22 :

భారత దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా గురువారం జరిగిన ‘అలాయ్ బలాయ్ - 2026 ఉత్సవాల వేదికగా దేశ ప్రగతి, ఐక్యతపై కీలక ప్రసంగం చేశారు. సమాజంలో ఆకలిదప్పులు లేని అభ్యుదయ వాతావరణాన్ని నిర్మించడంతోపాటు అవినీతికి, అఘాయిత్యాలకు ఏమాత్రం తావులేని విధంగా భారత దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. గతంలో భారతీయుల మధ్య ఉన్న చిన్నపాటి విభేదాలను, లొసుగులను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా మలుచుకుని దేశాన్ని సుదీర్ఘకాలం పాలించారని గుర్తు చేశారు. ఆ క్రమంలో మన దేశ

మిగతా 2వ పేజీలో..



ఎమ్మెల్సీ పోరుకు బీఆర్ఎస్ సమరశంఖం

- నియోజకవర్గాల వారీగా ఇన్ చార్జిల నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 22 :

రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రధాన ప్రతిపక్షం

మిగతా 2వ పేజీలో..



హైదరాబాద్ విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

2



నేడు దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ కమిటీ భేటీ

- ఐసీసీసీలో డిజిపిలు, ఐజిల సమావేశం
- ఉగ్రవాదం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల కట్టడిపై చర్చ
- అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణ, ఉమ్మడి సహకారం, కార్యాచరణపై సమీక్ష
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

కాంగ్రెస్ పాలనలో కృత్రిమ కరువు



- రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ఎండుతున్న పంటలు
- ఎల్‌నినో హెచ్చరికలను పట్టించుకోని ప్రభుత్వం

2

- మల్లన్నసాగర్‌కు నీళ్లు ఎత్తకపోవడంపై హరీశ్‌రావు ఆగ్రహం
- కరువు మండలాలు ప్రకటించి పరిహారం చెల్లించాలని డిమాండ్

నేల తల్లిని సంరక్షించుకుంటేనే ఆహార భద్రత



- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- ఖేత్ బచావో అభియాన్‌తో భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయానికి శ్రీకారం
- సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి

హైదరాబాద్, అక్టోబర్ 22 :

నేల తల్లిని సంరక్షించుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆహార భద్రత కల్పించగలమని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోకుండా వ్యవసాయంలో ఆశించిన దిగుబడులు సాధించడం సాధ్యం కాదని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల

మిగతా 3వ పేజీలో..

కాంగ్రెస్‌కు మరో 30 ఏళ్లు అధికారం దక్కదు: అమిత్ షా

- రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై కేంద్ర హోంమంత్రి విమర్శలు
- ఢిల్లీ జల్ బోర్డు రూ.8,941 కోట్ల విలువైన 43 ప్రాజెక్టులకు శ్రీకారం
- యమునా నది ప్రక్షాళనకు బీజేపీ కట్టుబడి ఉందని వెల్లడి
- చొరబాటుదారులను కాపాడేందుకే ఓట్ల చోరీ ఆరోపణలని వ్యాఖ్య



4

రాహుల్ గాంధీ, కాంగ్రెస్‌పై “రెజిమ్ ఛేంజ్” ఆరోపణలు..

- దేశ రాజకీయాల్లో సంచలనంగా ఫాక్స్ న్యూస్ నివేదిక..
- ఫ్రాన్స్, భారత్ నిరసనల వెనుక ఒకే నెట్‌వర్క్..
- రాహుల్ గాంధీపై బీజేపీ నేతల ఆరోపణలు..
- 9 దేశాల్లో 101 సంస్థల మధ్య సంబంధాలున్నాయన్న దర్యాప్తు కథనం
- ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్‌తో కాంగ్రెస్ నేతల భేటీలపై ప్రదీప్ భండారీ ప్రశ్నలు



4

87 నిమిషాల్లో రూ.3.34 కోట్ల సైబర్ దోపిడీ

- రాయదుర్గంలోని ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ సిస్టమ్‌లపై సైబర్ దాడి
- 183 లావాదేవీల ద్వారా 52 ఖాతాల్లోకి నిధుల మళ్లింపు
- బేగంపేట బ్రాంచ్ బ్యాంకు ఖాతాను లక్ష్యంగా చేసుకున్న నేరగాళ్లు
- బెంగళూరు, ఢిల్లీ, ముంబయి సహా పలు ప్రాంతాలకు విస్తరించిన లావాదేవీలు

2

- మ్యూల్ ఖాతాల ద్వారా నగదు తరలింపు.. దర్యాప్తు ముమ్మరం

అందమైన అమ్మాయిల పేరుతో హనీట్రాప్..

- 82 మంది పోలీసులే బాధితులు
- ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో 47 నకిలీ ఖాతాలతో వల
- వీడియో కాల్స్ రికార్డు చేసి బ్లాక్‌మెయిలింగ్.. లక్షల్లో వసూళ్లు
- డీఐ బాలస్వామి నుంచి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు గుంజిన వైనం

3

- వెయ్యికి పైగా బాధితులు.. నాలుగు దేశాలకూ విస్తరించిన నెట్‌వర్క్



విద్యుత్ కొరత రానివ్వొద్దు

- రోజువారీ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి
- ‘యాదాద్రి’ రెండు యూనిట్లకు కోల్ ఇండియా బొగ్గు
- మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు ఓటీఎస్
- థర్మల్ విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 22 :

ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ

మిగతా 3వ పేజీలో..

నేడు దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ కమిటీ భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 22:

దక్షిణాది రాష్ట్రాల మధ్య పోలీసు సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు డిజిపి సి.వి. ఆనంద్ తెలిపారు. సమావేశానికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన డీజీపీలు, ఐజీలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో, సిబిఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ సంస్థల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన నున్నారు. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీసు శాఖలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, పరస్పర సహకారం, సమన్వయంతో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ఉగ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాల అనంతర పరిస్థితులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక నేరాలు, యువత నిరసనలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలు సమావేశం ఎజెండాలో ఉన్నాయి. అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాల కదలికలు, నేరగాళ్ల సమాచార మార్పిడి, నేరాల దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, ఆయా రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచే మార్గాలపై సమీక్షించనున్నారు. దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరు, సముద్ర తీర ప్రాంతాల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీసింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వంటి అంశాలపై నా విస్తృతంగా చర్చించనున్నారు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో పనిచేస్తే సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను సమర్థంగా అరికట్టవచ్చన్న లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలో కృత్రిమ కరువు

సిద్దిపేట, అక్టోబరు 22:

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ వైఫల్యంతోనే రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి వైపరీత్యాలు కారణం కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యమే కారణమని ఆరోపించారు. దీనిని కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువుగా అభివర్ణించారు.

ముందస్తు హెచ్చరికలు బేఖాతరు

ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు, నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని హరీశ్‌రావు ఆరోపించారు. సకాలంలో సమీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోకపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని పేర్కొన్నారు. పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలను కాపాడుకునేందుకు రైతులు జనరేటర్లు, ఇన్వర్టర్లపై ఆధారపడాల్సి వస్తోందని, కేసీఆర్ పాలనలో దూరమైన కష్టాలు మళ్లీ మొదలయ్యాయని విమర్శించారు.

అధికారులను బెదిరిస్తే

సమస్య పరిష్కారం కాదు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ సమస్యలపై రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. సస్పెండ్ చేయాల్సింది అధికారులను కాదని, ముఖ్యమంత్రిని, విఫలమైన విద్యుత్ శాఖ మంత్రిని అని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి పొరుగు రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి రైతులకు పరిహారం అందిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

మల్లన్నసాగర్‌కు నీళ్లు

ఎత్తకపోవడంపై ఆగ్రహం

కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే రాజకీయ కక్షతోనే మల్లన్నసాగర్‌ను నింపకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) కన్నెపల్లి వద్ద మోటార్లు నడిపేందుకు అనుమతించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. మల్లన్నసాగర్‌కు నీటిని ఎత్తిపోసి ఉంటే సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ వినియోగించుకోలేని ప్రభుత్వ అసమర్థత వల్లే కృత్రిమ కరువు ఏర్పడిందని దుయ్యబట్టారు. రాబోయే 20 రోజులపాటు రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తే మిగిలిన పంటలైనా చేతికొస్తాయని హరీశ్‌రావు సూచించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా కరువు మండలాలను ప్రకటించి, ఎండిపోయిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ పోరుకు బీఆర్ఎస్ సమరశంఖం

మొదటిపేజీ తరువాయి

సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాటి విభజన బీఆర్ఎస్ పార్టీ కదనరంగంలోకి దూకింది. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గులాబీ దళం క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని, పోటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నియోజక వర్గాల వారీగా ప్రత్యేక ఇన్‌చార్జిలను నియమించింది. గురువారం తెలంగాణ భవన్లో నిర్వహించిన కీలక సమీక్షా సమావేశం అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఇన్‌చార్జిల పేర్లను అధికారికంగా ప్రకటించారు.

రెండు కీలక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

ఖమ్మంవరంగల్ నల్గొండ, మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రాముఖ్యత ఉన్న సీనియర్ నాయకులకు బాధ్యతలను అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను ఏకం చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను ఈ ఇన్‌చార్జిలకు కేటాయించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియను మొదటి ప్రాధాన్యతగా చేపట్టాలని కేటీఆర్ ఇన్‌చార్జీలను, కేడర్ ను ఆదేశించారు.

హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, అక్టోబర్ 22 :

దసరా సెలవులు ముగిసి ప్రజలు తిరిగి నగరానికి పయనమవడంతో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సెలవులు ముగించుకుని సిటీకి వస్తున్న వాహనదారులతో హైవే కిటకిటలాడింది. చౌటుప్పల్ లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు ముందుకు కదలక నెమ్మదిగా సాగాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాల కోసం ఏకంగా 10 టోల్ బూత్ లను ఓపెన్ చేసినప్పటికీ రద్దీని పూర్తిగా నియంత్రించలేకపోయారు. దసరా సందర్భంగా ఈ పది రోజుల్లో జాతీయ రహదారిపై సుమారు ఏడు లక్షల వాహనాలు రాకపోకలు సాగించినట్లు అధికారులు వెల్లడించారు. పండుగ రద్దీని ముందే అంచనా వేసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం విఫలమైందని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుల గణనలో తప్పులుంటే సరిచేస్తాం

మొదటిపేజీ తరువాయి

దేశంలోనే తొలిసారిగా పందేళ్ల నాటి రికార్డులను పక్కనపెట్టి సమగ్ర కుల గణన చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని సీఎం పేర్కొన్నారు. ముదిరాజులను బీసీఏ జాబితాలో చేర్చే అంశంపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. ఈ విషయంలో గంగ పుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తొలగిస్తామని తెలిపారు.

బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ లక్ష్యమని, వారికి విడతలవారీగా సముచిత పదవులు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు విషయంలో పీసీసీని ఒప్పించే బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు.

గత పాలనతో పోలిస్తే మెరుగ్గా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో దొడ్డి కొమరయ్యతో పాటు పండుగ సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రజల ఆశీర్వాదమే తనకు కొండంత బలమని పేర్కొన్న సీఎం.. దేశంలో బలహీన వర్గాల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని పిలుపునిచ్చారు.



కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన..

- **రూ.110 కోట్లతో ఆలయ అభివృద్ధి**
- **దసరా వేళ సొంత నియోజకవర్గంలో పర్యటించిన ముఖ్యమంత్రి**
- **తిరుమల తరహాలో కొడంగల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి**
- **నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎం.. అధికారులకు కీలక ఆదేశాలు**

వికారాబాద్, అక్టోబరు 22:

దసరా పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీఎం రాకతో నియోజకవర్గంలో సందడి నెలకొంది.

తిరుమల తరహాలో ఆలయ అభివృద్ధి

కొడంగల్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.110 కోట్లతో చేపట్టిన పనులను రేవంత్ రెడ్డి పరిశీలించారు. నాలుగు వైపులా రాజగోపురాలు, మాడవీధులు, పుష్కరిణి నిర్మాణంతో పాటు భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ, జిల్లా అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి పి.వి. శ్రీనివాస రాజు తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

ఆలయ పనుల పరిశీలన అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన ప్రజలతో కార్యాలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రజల వద్దకు వెళ్లిన రేవంత్ రెడ్డి వారి సమస్యలు, వినతులను స్వయంగా స్వీకరించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అక్కడే ఉన్న అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనిత, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, ఎంపీడీవో జయశ్రీ, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరా శుభాకాంక్షలు

విజయదశమి సందర్భంగా కొడంగల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సందడితో కొడంగల్‌లో పండుగ వాతావరణం నెలకొంది.



87 నిమిషాల్లో రూ.3.34 కోట్ల సైబర్ దోపిడీ

- **రాయదుర్గంలోని ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ సిస్టమ్‌లపై సైబర్ దాడి**
- **183 లావాదేవీల ద్వారా 52 ఖాతాల్లోకి నిధుల మళ్లింపు**
- **బేగంపేట బ్రాంచ్ బ్యాంకు ఖాతాను లక్ష్యంగా చేసుకున్న నేరగాళ్లు**
- **బెంగళూరు, దిల్లీ, ముంబయి సహా పలు ప్రాంతాలకు విస్తరించిన లావాదేవీలు**
- **మ్యూల్ ఖాతాల ద్వారా నగదు తరలింపు.. దర్యాప్తు ముమ్మరం**

హైదరాబాద్, అక్టోబరు 22:

హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ సైబర్ దోపిడీ వెలుగులోకి వచ్చింది. రాయదుర్గంలోని ఓ ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) డిజిటల్ వ్యవస్థల్లోకి చొరబడిన సైబర్ నేరగాళ్లు కేవలం 87 నిమిషాల్లో రూ.3.34 కోట్లను కొల్లగొట్టారు. ఉదయం 10.31 గంటల నుంచి 11.58 గంటల మధ్య 183 లావాదేవీల ద్వారా ఈ మొత్తాన్ని దేశవ్యాప్తంగా ఉన్న 52 వేర్వేరు బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు.

సాంకేతికతతో నిధుల మళ్లింపు

సంస్థ అంతర్గత సిస్టమ్‌లను హ్యాక్ చేసిన నేరగాళ్లు, బేగంపేట బ్రాంచ్‌కు చెందిన బ్యాంకు ఖాతాలోని నిధులను అనధికారికంగా ఇతర ఖాతాలకు మళ్లించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. స్వదేశీ, విదేశీ నెట్‌వర్క్‌లను ఉపయోగించి వేగంగా లావాదేవీలు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. తక్కువ సమయంలోనే భారీ మొత్తం బదిలీ కావడాన్ని గుర్తించిన సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అప్రమత్తమై అధికారులకు ఫిర్యాదు చేశారు.

మ్యూల్ ఖాతాలపై దర్యాప్తు

ఫిర్యాదు ఆధారంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. బదిలీ అయిన నిధులు బెంగళూరు, దిల్లీ, ముంబయి, ఉత్తరప్రదేశ్ సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఖాతాలకు చేరినట్లు గుర్తించారు. ఈ 52 ఖాతాలను సైబర్ నేరగాళ్లు కమీషన్ల కోసం వినియోగించే 'మ్యూల్ ఖాతాలు'గా పోలీసులు అనుమానిస్తున్నారు. డబ్బును ఇతర ఖాతాలకు లేదా క్రిప్టో ఖాతాల్లోకి తరలించకుండా అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐపీ చిరునామాలు, బ్యాంకు లావాదేవీల వివరాల ఆధారంగా ప్రత్యేక బృందాలు దర్యాప్తును వేగవంతం చేశాయి. నిధుల మళ్లింపు వెనుక ఉన్న వ్యక్తులు, నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



'వికసిత భారత్' సాధనే లక్ష్యం కావాలి

మొదటిపేజీ తరువాయి

రాజకీయాల నుంచి నేర్చుకున్న పాఠాలతో ప్రస్తుత తరుణంలో ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. మనుషుల మధ్య ఉన్న ద్వేషాలను పక్కనబెట్టి ప్రేమను పంచుతూ ఆత్మీయ అనుబంధాలను బలోపేతం చేసే ఒక గొప్ప సామాజిక వేదిక అలాయ్ బలాయ్ అని ఆయన కొనియాడారు. మానవత్వాన్ని మేల్కొలిపి ముందుకు తీసుకెళ్లే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతిని, అనుబంధాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు.

2026 ప్రధాన ఇతివృత్తం 'నషా ముక్త్ భారత్'

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నాయకత్వంలో అలాయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 20వ వార్షిక ఉత్సవాల్లో ఈసారి 'నషా ముక్త్ భారత్' (వ్యసన రహిత భారతం) అనే ప్రధాన నినాదంతో యువతను చైతన్యపరిచారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలైన బతుకమ్మ, బోనాలు, గిరిజన గుస్సాడీ నృత్యాలు, దప్పు చప్పుళ్లతో పాటు సోరూరించే తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఈ వేడుకలు అత్యంత కోలాహలంగా సాగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, వి.హనుమంతరావు, మెదక్ ఎంపీ రఘునందనరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సహా రాజకీయ, సినిమా, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఐక్యత, సోదరభావం

అలాయ్ బలాయ్ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకో పరిమితమైనది కాదని, ఇది పూర్తిగా సాంస్కృతిక, సామాజిక వేదిక అని హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. భిన్న రాజకీయ భావజాలాలు, విబేధాలు ఉన్నప్పటికీ నాయకులందరూ ఒక రినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయతను చాటుకునేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండు కళ్ల లాంటివని, ఇరు రాష్ట్రాల ప్రజలు ప్రాంతీయ భేదాలు మరిచి పరస్పర సహకారంతో కలిసికట్టుగా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఏడాది ఉత్సవాల ప్రధాన ఇతివృత్తం 'నషా ముక్త్ భారత' (మత్తు రహిత భారతదేశం) గురించి ప్రస్తావించారు. ఉత్సవాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇవ్వాలన్నారు. ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటుండటం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన యువతను కాపాడుకోవడానికి వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. భారత దేశాన్ని 2047 నాటికి 'వికసిత్ భారత' (అభివృద్ధి చెందిన దేశం)గా మార్చాలనే సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఆకలి కేకలు, దప్పులు లేని అభ్యుదయ సమాజాన్ని నిర్మించాలని, అవినీతి, అఘాయిత్యాలకు తావులేని విధంగా భారతదేశాన్ని బలోపేతం చేయాలని దత్తాత్రేయ ఆకాంక్షించారు. బ్రిటిష్ వారు చేసిన విభజన రాజకీయాల నుంచి పాఠాలు నేర్చుకుని మనమంతా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలన్నారు. గత రెండు దశాబ్దాలుగా అలాయ్ బలాయ్ కార్యక్రమం తెలంగాణ గ్రామీణ కళలకు, జానపద నృత్యాలకు, సంప్రదాయ వంటకాలకు ఒక అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చిందని ఆయన సగర్వంగా ప్రకటించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత అని గుర్తు చేశారు.



విద్యుత్ కొరత రానివ్వొద్దు

మొదటిపేజీ తరువాయి

విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్క రోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈస్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి.. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకొస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 202425లో 65.90 మిలియన్ యూనిట్లు, 202526లో సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈనెల 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్ల మేర సుమారు 19 శాతం పెరుగుదల నమోదైంది. ఈనెల 16న ఒక్క రోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.

మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు ఓటీఎస్ అవకాశం

రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల చెల్లింపుల విషయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానం ద్వారా బకాయిల చెల్లింపును సులభతరం చేసి వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆ పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుని విద్యుత్ బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలను డిప్యూటీ సీ¾ఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతోపాటు విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, ఆర్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

నేల తల్లిని సంరక్షించుకుంటేనే ఆహార భద్రత

మొదటిపేజీ తరువాయి

సంక్షేమంతోపాటు భవిష్యత్ వ్యవసాయాన్ని దృష్టిలో పెట్టుకుని భూసార పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన' (సాగు భూమి సంరక్షణ) కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వ్యవసాయ భూముల పరిరక్షణ, భూసార పరీక్షలు, నీటి పొదుపు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పంట వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై రైతులకు కీలక సూచనలు చేశారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములను అందించాలంటే వ్యవసాయ పద్ధతుల్లో శాస్త్రీయ మార్పులు తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, ఋతుపవనాల తగ్గుదల, భూతాపం పెరుగుదల, వర్షపాతం అసమానతలు, వర్షాలు సకాలంలో కురవకపోవడం వంటి పరిస్థితులు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూమి స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందులను శాస్త్రవేత్తలు సూచించిన మోతాదుల్లోనే ఉపయోగించాలని మంత్రి స్పష్టం చేశారు. పంటల్లో రసాయనాల అవశేషాలు పెరిగితే ఆహార నాణ్యత, భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా తన పంట భూమికి భూసార పరీక్షలు చేయించుకుని నేలలో ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని ఏ పంటకు ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో అవసరమో నిర్ధారించుకున్నాకే వాటిని వినియోగించాలని సూచించారు. దీనివల్ల ఎరువుల ఖర్చు తగ్గడంతోపాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. రైతులను సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించడంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు.

నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి వినియోగంలో రైతులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూమి రకం, నీటి వసతి, స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి రెండుమూడు తడులతో పండే స్వల్పకాలిక పంటలు, అపరాల పంటలను సాగు చేసుకునేలా రైతులకు సలహాలివ్వాలని సూచించారు. సంప్రదాయ పంటలతోపాటు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు సమూహాల ద్వారా యంత్రాలు అందుబాటులోకి తేవడం వల్ల సాగు పనులు సకాలంలో పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఖేత్ బచావో అభియాన్‌ను వ్యవసాయ భూముల పరిరక్షణకు నిరంతరం కొనసాగాల్సిన ఉద్యమంగా తీసుకోవాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారులు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఆదివాసీలకు దిక్సూచి కొమురం భీం

- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

దుమ్ముగూడెం, అక్టోబర్ 22 :

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు కొమురం భీం అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో గురువారం జరిగిన కొమురం భీం విగ్రహావిష్కరణ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివాసీ సమాజానికి కొమురం భీం ఒక దిక్సూచి అని, ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శక మని మంత్రి పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కొమురం భీం, బిర్సా ముండా, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు తమ పోరాటాలతో సమాజంలో మార్పునకు బాటలు వేశారని సీతక్క అన్నారు. వారు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే అణగారిన వర్గాలకు హక్కులు, రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు అందాయని గుర్తు చేశారు. అలాంటి మహనీయులను మన హృదయాల్లో నిలుపుకొని, వారి ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఇతర సామాజిక వర్గాలతో కలిసిమెలిసి జీవిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారన్నారు. ఆదివాసీ పోరాటాలు దేశ చరిత్రలో కీలకమైనవని, అణచివేతకు వ్యతిరేకంగా వారు సాగించిన పోరాటాలు హక్కుల సాధనకు మార్గం చూపాయని పేర్కొన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీతక్క అన్నారు. సమస్యలను ఐక్యంగా ప్రభుతం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు సాధించుకోవాలని సూచించారు. పరస్పర సహకారం, ఐక్యతతోనే




ఆదివాసీ సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. విగ్రహావిష్కరణకు ఆదివాసీ సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపునిస్తూ జై కొమురం భీ అని నినదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు సహా అధిక సంఖ్యలో ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

అందమైన అమ్మాయిల పేరుతో హనీట్రాప్..

- **82 మంది పోలీసులే బాధితులు**
- **ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో 47 నకిలీ ఖాతాలతో వల**
- **వీడియో కాల్స్ రికార్డు చేసి బ్లాక్‌మెయిలింగ్.. లక్షల్లో వసూళ్లు**
- **డీఐ బాలస్వామి నుంచి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు గుంజిన వైనం**
- **వెయ్యికి పైగా బాధితులు.. నాలుగు దేశాలకూ విస్తరించిన నెట్‌వర్క్**

హైదరాబాద్, అక్టోబరు 22:



అందమైన అమ్మాయిల పేరుతో సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకుని, తీయని మాటలతో నమ్మించి, ఆపై ప్రైవేట్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్న అంతర్రాష్ట్ర హనీట్రాప్ ముఠా గుట్టును హైదరాబాద్ సిటీ పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు కొండబత్తుల పవన్‌కుమార్ రావును అరెస్టు చేశారు. సామాన్యులనే కాకుండా చట్టాన్ని కాపాడే పోలీసు అధికారులనూ లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా ఉచ్చులో ఏకంగా 82 మంది పోలీసులు చిక్కినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఓ ఇన్స్పెక్టర్ ఉద్యోగం కోల్పోయి ప్రస్తుతం రిమాండ్‌లో ఉండగా, మరో ఏసీపీ విచారణను ఎదుర్కొంటున్నారు.

నకిలీ ఖాతాలతో వల..

వీడియోలతో బెదిరింపులు

పోలీసుల విచారణలో పవన్‌కుమార్ తన మాజీ ప్రియురాలితో కలిసి ఈ దందా సాగించినట్లు తేలింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 33, ఫేస్‌బుక్‌లో 14 నకిలీ ఖాతాలను సృష్టించి, వాటికి అందమైన అమ్మాయిల ఫొటోలను ప్రొఫైల్ చిత్రాలుగా పెట్టేవాడు. ప్రధానంగా పోలీసు అధికారులకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి, పరిచయం పెరిగిన తర్వాత శృంగారపరమైన సంభాషణలకు తెరతీసేవాడు. వీడియో కాల్స్ సమయంలో బాధితుల ప్రైవేట్ దృశ్యాలను రికార్డు చేసి, వాటిని మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగేవాడు. వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగాలు పోయేలా చేస్తామని భయపెట్టి డబ్బులు వసూలు చేసేవాడు. తాము మాట్లాడుతున్నది అమ్మాయి కాదని తెలిసిన తర్వాత కూడా కొందరు అధికారులు అతనితో చాటింగ్ కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు.

డీఐ బాలస్వామికి పెళ్లి పేరుతో టోకరా

ఈ వ్యవహారంలో ఖైరతాబాద్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ బాలస్వామి ఉదంతం సంచలనం రేపింది. పవన్‌కుమార్ 'చందన' అనే పేరుతో నకిలీ ఖాతాను సృష్టించి, ఆమె తన బంధువని, ఆమెతో పెళ్లి జరిపిస్తానని బాలస్వామిని నమ్మించాడు. వాస్తవానికి చందన అనే వ్యక్తి లేకపోయినా, ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోందని చెప్పి వైద్య ఖర్చుల పేరుతో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంతటితో ఆగకుండా బాలస్వామిని భార్యాపిల్లలకు దూరంగా దాదాపు ఆరు నెలలపాటు ఓ లాడ్జిలోనే ఉండేలా చేసి మానసికంగా వేధించినట్లు ఆరోపణలున్నాయి. ఇంటికి వెళితే అక్రమ కేసులు పెట్టి ఉద్యోగం పోగొడతానంటూ బెదిరించినట్లు సమాచారం. బాలస్వామి భార్య గంజి హరిత ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం బాలస్వామి ఈ కేసుకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు.

25 నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన

- **క్రిటికల్ మినరల్స్ రంగంలో ద్వైపాక్షిక సహకారం బలోపేతానికి..**
- **సిడ్నీలో ఐఎంపీఆర్‌సీ-2026 ప్రపంచ సదస్సులో కీలక ప్రసంగం**
- **ఆస్ట్రేలియా వనరుల శాఖ మంత్రి మడలైన్ కింగ్‌తో ప్రత్యేక భేటీ**

న్యూదిల్లీ, అక్టోబర్ 22 :



భారత్‌ఆస్ట్రేలియా, ఇతర దేశాల మధ్య గనులు, క్రిటికల్ మినరల్స్, ఆధునిక సాంకేతికత, ప్రాసెసింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు.భారత్‌లో పెరుగుతున్న ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ అవసరాలకు అనుగుణంగా క్రిటికల్ మినరల్స్ సరఫరాను బలోపేతం చేయడం, వివిధ దేశాలనుంచి ఉన్న వనరుల ద్వారా వాటిని సమకూర్చుకునే అవకాశాలను పెంచుకోవడమే కిషన్ రెడ్డి పర్యటన ప్రధాన ఉద్దేశం. దేశంలోని మైనింగ్ ప్రాజెక్టులలో పెట్టుబడులు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సంయుక్త పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి, ఎక్స్‌ప్లొరేషన్ తదితర అంశాలపైనా తన పర్యటనలో దృష్టి సారించనున్నారు. విస్తారమైన ఖనిజ వనరులు, అధునాతన మైనింగ్ టెక్నాల జీ కలిగిన దేశాలతో ముఖ్యంగా ఆస్ట్రేలియాతో సహకారం మినరల్ ఎక్స్‌ప్లొరేషన్, మైనింగ్, వ్యాల్యూ యాడెడ్ ప్రోడక్ట్స్ తయారీ వరకు భారత్‌కు కీలకం కానుంది.

సిడ్నీలో పర్యటన వివరాలు

25న కేంద్ర మంత్రి సిడ్నీ చేరుకుంటారు. 26న నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సిడ్నీ కార్యాలయాన్ని ప్రారంభించి సంస్థ కార్యకలాపాలను సమీక్షిస్తారు. అదే రోజు ఇంటర్నేషనల్ మైనింగ్ అండ్ రిసోర్సెస్ కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్‌పో(ఐఎంఏఆర్‌సీ) 2026లో పాల్గొంటారు. 27న ఆస్ట్రేలియా వనరులు, ఉత్తర ఆస్ట్రేలియా వ్యవహారాల శాఖ మంత్రి మడలైన్ కింగ్‌తో సమావేశమవుతారు. ఐఎంఏఆర్‌సీ సదస్సులో ఎన్ఎండీసీ ఏర్పాటు చేస్తున్న 'ఇండియా పెవిలియన్'ను కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు. ప్రధాన ఆస్ట్రేలియా మైనింగ్ కంపెనీలు, బీఆర్ఏబీయూఎస్ సంస్థ, భారత పరిశ్రమల సమాఖ్య మైనింగ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశమవుతారు. 28న మినరల్స్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియాతో క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ ఖనిజాలపై జరగనున్న ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొంటారు. ఆస్ట్రేలియా వనరుల శాఖ సహాయ మంత్రి ఆంథనీ చిషోల్మ్ కూడా హాజరుకానున్నారు.

మెల్‌బోర్న్‌లో పరిశోధన, పెట్టుబడి అవకాశాలపై చర్చలు

28న కేంద్ర మంత్రి మెల్‌బోర్న్‌కు వెళ్లనున్నారు. అక్కడ మన దేశానికి చెందిన పబ్లిక్ సెక్టార్ యూనిట్ నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌బీసీసీ) ఆస్ట్రేలియా శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం కిషన్ రెడ్డి సమక్షంలో ఎన్‌బీసీసీగోల్డ్ ఫీల్డ్స్ ఆస్ట్రేలియా మధ్య అవగాహన ఒప్పందాల మార్పిడి జరగనుంది. తర్వాత ప్రవాస భారతీయులతో సమావేశమవుతారు. 29న మోనాష్ విశ్వవిద్యాలయంలో క్రిటికల్ మినరల్స్, మైనింగ్‌లో నూతన సాంకేతికత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత, ఖనిజ వనరుల అభివృద్ధి, సంయుక్త పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధిపై జరిగే సదస్సులో పాల్గొంటారు. విక్టోరియా ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులతో భారత్‌లో పెట్టుబడులు, మైనింగ్ ప్రాజెక్టుల అభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చిస్తారు. ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ మెటలర్జీ సీనియర్ శాస్త్రవేత్తలతో సాంకేతిక నైపుణ్యం, వృత్తిపరమైన శిక్షణ, మైనింగ్ రంగానికి అవసరమైన నిపుణుల తయారీ, పర్యావరణహిత మైనింగ్ విధానాలపై ప్రధానంగా చర్చించనున్నారు. అనంతరం 30న కేంద్ర మంత్రి భారత్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.

ఈ పర్యటన ద్వారా భారత్‌కు ప్రయోజనాలు

క్రిటికల్ మినరల్స్, స్ట్రాటజిక్ మినరల్స్ మైనింగ్, ప్రాసెసింగ్, కోల్ గ్యాసిఫికేషన్‌లో సహకారం కోసం భారత్, ఆస్ట్రేలియా మధ్య 2020 జూన్‌లో కుదిరిన అవగాహన ఒప్పందం ఆధారంగా ఈ ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కిషన్ రెడ్డి పర్యటన దోహదపడనుంది. ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కేఏబీఐఎల్) ద్వారా లిథియం, కోబాల్ట్, నికెల్, రేర్ ఎర్త్, గ్రాఫైట్ వంటి మినరల్స్ ప్రాజెక్టుల్లో పెట్టుబడి అవకాశాలను గుర్తించడం ప్రాధాన్యతాంశాల్లో ఒకటి. భారతీయ సంస్థలను ఆస్ట్రేలియాలోని ఖనిజ ప్రాజెక్టుల అభివృద్ధికారులతో అనుసంధానం చేయడం, కొత్త ప్రాజెక్టుల్లో భాగస్వామ్య అవకాశాలను పరిశీలించడం ద్వారా దీర్ఘకాలిక ఖనిజ సరఫరాకు మార్గాలను విస్తరించేందుకు ఈ పర్యటన కీలకం కానుంది.

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- **కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి**
- **పత్తి రైతుకు ధరల భరోసా కల్పించాలి**
- **మంత్రి తుమ్మల**

హైదరాబాద్, అక్టోబర్ 22:

రాష్ట్రంలో 202627 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోలు కేంద్రాలను గతేడాది మాదిరిగానే ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సెక్రెటేరియట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ కొనుగోళ్లకు చేసిన ఏర్పాట్లు, రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడటం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత 202627 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. గత సీజన్‌లో 50.73 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, 28.33 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. కేంద్ర ప్రభుత్వం 202627 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.8,667గా ప్రకటించిందని.. ప్రస్తుతం తెలంగాణలో పత్తి మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000గా ఉందని అధికారులు వివరించారు. ఇది కనీస మద్దతు ధర కంటే రూ.333 అధికమని తెలిపారు. మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయించుకోవచ్చని, ధరలు తగ్గి కనీస మద్దతు ధర కంటే దిగువకు వచ్చినప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత ఆధారంగా సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు ధర నిర్ణయిస్తారని, రైతులు పత్తిని విక్రయించే ముందు నాణ్యత ప్రమాణాలు, తేమ శాతాన్ని పరిశీలించుకోవాలని సూచించారు.

335 జిన్నింగ్ మిల్లులు నోటిపై

202627 సీజన్‌లో పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ గత సీజన్‌లో ఉన్న 122 కొనుగోలు కేంద్రాల సంఖ్యను 133కు పెంచామని.. రాష్ట్రంలో రోజుకు 1,09,035 బేళ్ల సామర్థ్యంతో 356 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 30 జిల్లాల్లో 335 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిపై చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 640, 641 ద్వారా రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీని, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీలు పత్తి మార్కెట్ ధరలు, కొనుగోళ్ల పురోగతి, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. పత్తి కొనుగోళ్లలో తెలంగాణ దేశంలో ముందంజలో ఉండటానికి రాష్ట్రంలో పండించే నాణ్యమైన పత్తి ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు మరో 30 ఏళ్లు అధికారం దక్కదు: అమిత్ షా

- రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై కేంద్ర హోంమంత్రి విమర్శలు
- ఢిల్లీ జల్ బోర్డు రూ.8,941 కోట్ల విలువైన 43 ప్రాజెక్టులకు శ్రీకారం
- యమునా నది ప్రక్షాళనకు బీజేపీ కట్టుబడి ఉందని వెల్లడి
- చొరబాటుదారులను కాపాడేందుకే ఓట్ల చోరీ ఆరోపణలని వ్యాఖ్య



న్యూఢిల్లీ, అక్టోబరు 22:

కాంగ్రెస్ పార్టీకి రాబోయే 30 ఏళ్ల వరకు అధికారంలోకి వచ్చే అవకాశం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీ జల్ బోర్డుకు చెందిన రూ.8,941 కోట్ల విలువైన 43 ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు మరికొన్నింటికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు. రాహుల్ విదేశీ పర్యటనను ప్రస్తావిస్తూ.. ఆయన భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత తన మాటలు వినాలని అన్నారు. ఇది రాహుల్ వ్యక్తిగత విషయమైనప్పటికీ, కాంగ్రెస్‌కు మరో మూడు దశాబ్దాల వరకు అధికారం దక్కదని వ్యాఖ్యానించారు.

యమునా ప్రక్షాళనపై బీజేపీ హామీ

దశాబ్దాలపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ యమునా నది ప్రక్షాళనకు చేసిందేమీ లేదని అమిత్ షా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో యమునోత్రి నుంచి సంగమం వరకు నదిని శుభ్రం చేసే అవకాశం బీజేపీకి దక్కుతుందని పేర్కొన్నారు. చొరబాటుదారులను కాపాడాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

నిరసనలు, ప్రదర్శనలతో ప్రయోజనం ఉండదని, ఎన్నికైన ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అమిత్ షా సూచించారు. రాబోయే ఎన్నికల్లో పంజాబ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడాలని అక్కడి ప్రజలు నిర్ణయించుకున్నారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల నుంచి ప్రధాని మోదీ వరకు పార్టీ శ్రేణులంతా ప్రజల మధ్య ఉంటూ వారి ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

రాహుల్ గాంధీ, కాంగ్రెస్‌పై "రెజిమ్ ఛేంజ్" ఆరోపణలు..

- దేశ రాజకీయాల్లో సంచలనంగా ఫాక్స్ న్యూస్ నివేదిక..
- ఫ్రాన్స్, భారత్ నిరసనల వెనుక ఒకే నెట్‌వర్క్..
- రాహుల్ గాంధీపై బీజేపీ నేతల ఆరోపణలు..
- 9 దేశాల్లో 101 సంస్థల మధ్య సంబంధాలున్నాయన్న దర్యాప్తు కథనం
- నెవిల్లే రాయ్ సింగమ్‌తో రాహుల్‌కు సంబంధాలున్నాయన్న నిశికాంత్ దూబే
- అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ మార్పునకు కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్‌తో కాంగ్రెస్ నేతల భేటీలపై ప్రదీప్ భండారీ ప్రశ్నలు

న్యూఢిల్లీ, అక్టోబరు 22:

ఫ్రాన్స్‌లో జరిగిన అల్లర్లు, భారత్‌లో కొనసాగుతున్న నిరసనల వెనుక ఒకే అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉందంటూ ఫాక్స్ న్యూస్ ప్రచురించిన దర్యాప్తు కథనం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. తొమ్మిది దేశాల్లోని 101 సంస్థలు నిరసనలకు మద్దతు ఇవ్వడం, వాటిని నిర్వహించడం, ప్రచారం చేయడంలో పరస్పరం అనుసంధానమై ఉన్నాయని నివేదిక ఆరోపించింది. ఫాక్స్ న్యూస్ సీనియర్ ఎడిటర్ అస్రా నోమానీ రూపొందించిన 'గ్లోబల్ ఖయాస్ ఇంక్ గ్రోస్ టు 101 గ్రూప్స్' కథనంలో ఈ వ్యవస్థను 'రెడ్‌గ్రీన్ ప్రొటెస్ట్ ఎకోసిస్టమ్'గా అభివర్ణించారు. ఈ నివేదికను ప్రస్తావిస్తూ బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు.

రాహుల్–సింగమ్ సంబంధాలపై ఆరోపణలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి నివేదికలో ప్రస్తావించిన వ్యాపారవేత్త నెవిల్లే రాయ్ సింగమ్‌తో సంబంధాలున్నాయని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఆరోపించారు. భారత్‌లో ప్రభుత్వాన్ని మార్చే లక్ష్యంతో అంతర్జాతీయ స్థాయిలో కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. దీనిని 'రెజిమ్ ఛేంజ్ ఆపరేషన్'గా అభివర్ణించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేసిన ఆయన.. గురువారం నిర్వహించనున్న మీడియా సమావేశంలో ఆరోపణలకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తానని తెలిపారు.

ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్‌తో సంబంధాలపై ప్రశ్నలు

బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ కూడా ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ అనే అంతర్జాతీయ సంస్థపై ఆరోపణలు చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో ఆ సంస్థ ప్రతినిధులను కలిశారని పేర్కొన్నారు. భారత్‌లో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకత్వం ఆ సంస్థతో సంప్రదింపులు జరిపిందా? అలాంటి సంబంధాలు నిరసనల ప్రచారంపై ప్రభావం చూపాయా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వియత్నాం పర్యటనపైనా భండారీ సందేహాలు వ్యక్తం



చేశారు. నవంబరు 1న జరగనున్న నిరసనకు ముందు అంతర్జాతీయ సంస్థల సూచనలు తీసుకునేందుకే ఆయన పర్యటనకు వెళ్లారా? అని ప్రశ్నించారు. అయితే, ఫాక్స్ న్యూస్ నివేదికలో పేర్కొన్న సంస్థల మధ్య సంబంధాలు, బీజేపీ నేతలు చేసిన ఆరోపణలు వేర్వేరు అంశాలు. ప్రభుత్వ మార్పు కోసం కుట్ర జరిగిందన్న ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర ధ్రువీకరణను ఈ వివరాలు నిర్ధారించడం లేదు.

ఎర్ర సముద్రంలో భారతీయుల పడవపై సౌదీ దాడి?

- పడవలో 14 మంది భారతీయులు.. రక్షణకు హౌతీల చర్యలు
- జుకార్ ద్వీపం సమీపంలో ఘటన జరిగినట్లు ప్రకటన
- అంతర్జాతీయ నౌకాయానానికి ముప్పు పొంచి ఉందని హౌతీల ఆందోళన
- ఘటనపై స్పందించని సౌదీ అరేబియా

న్యూఢిల్లీ, అక్టోబరు 22:

ఎర్ర సముద్రంలో 14 మంది భారతీయులు ప్రయాణిస్తున్న పడవపై సౌదీ అరేబియా దాడి చేసినట్లు యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఆరోపించారు. గురువారం జుకార్ ద్వీపం సమీపంలో ఈ ఘటన జరిగినట్లు హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సరీ వెల్లడించారు. పడవలో ఉన్న భారతీయులను రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టినట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

యాహ్యా సరీ ప్రకారం.. భారతీయులతో వెళ్తున్న పడవను లక్ష్యంగా చేసుకుని సౌదీ దాడి చేసింది. ఈ చర్య నిర్లక్ష్యపూరితమైందని హౌతీలు విమర్శించారు. ఇలాంటి ఘటనలు ఎర్ర సముద్రంలో అంతర్జాతీయ నౌకాయానానికి ముప్పు కలిగిస్తాయని పేర్కొంటూ, ఇటువంటి చర్యలను అడ్డుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు.

దాడి జరిగినట్లు చెబుతున్న ప్రాంతం బాబ్ అల్ మాండెబ్ జలసంధికి సమీపంలో ఉంది. ఈ



జలసంధి ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో అనుసంధానిస్తుంది. అక్కడి నుంచి హిందూ మహాసముద్రానికి వెళ్లేందుకు కీలక మార్గంగా ఉండటంతో అంతర్జాతీయ వాణిజ్య నౌకాయానంలో ఈ ప్రాంతానికి ప్రాధాన్యం ఉంది.

పడవలో ఉన్న 14 మంది భారతీయుల ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యల పురోగతిపై పూర్తి వివరాలు వెల్లడికాలేదు. హౌతీలు చేసిన ఆరోపణలపై సౌదీ అరేబియా అధికారికంగా స్పందించలేదు.

కేసీఆర్ ఫామ్ హౌస్ కు నీళ్ల మళ్లింపుపై విచారణ జరిపించండి

- ఇరిగేషన్ శాఖకు ఎంపీ చామల లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 22:



మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్కు నీళ్ల మళ్లింపుపై విచారణ జరపాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గురువారం ఇరిగేషన్ శాఖకు లేఖ రాశారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి ఫామ్ హౌస్ కు నీళ్ల మళ్లింపుపై విచారణ జర పాలని ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రజల అవసరాల కోసం ఉపయోగించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను వ్యక్తిగత అవసరాల కోసం ఫామ్ హౌస్ కు వాడుకోవడంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు. ప్రాజెక్టు రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే ప్రజా ధనం ఎంత దుర్వినియోగం అయిందో లెక్క బయటకు వస్తుందని అన్నారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి పాండురంగ చెరువుకు అక్కడి నుంచి కేసీఆర్ ఫామ్ హౌస్ కు నీళ్ల తరలింపుపై వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

యువతితో అసభ్య ప్రవర్తన..

హైదరాబాద్, అక్టోబరు 22:

పొరుగింటి యువతిని వేధించాడన్న ఆరోపణతో జరిగిన ఘర్షణలో డీఆర్‌డీవో ఉద్యోగి రామ్మోహన్ (55) ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటేశ్వర స్వామి దేవాలయం వీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రామ్మోహన్ రెండేళ్లుగా నివసిస్తున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న యువతిని కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో మరోసారి యువతిని వేధించడంతో ఆమె భయంతో కేకలు వేస్తూ పక్కనే నివసించే అభిజిత్‌కు సమాచారం ఇచ్చింది. అక్కడికి చేరుకున్న అభిజిత్.. యువతిని ఎందుకు వేధిస్తున్నావంటూ రామ్మోహన్‌ను నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలై ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో అభిజిత్ బలంగా నెట్టడంతో రామ్మోహన్ కిందపడిపోయాడు. అతడి తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే కాచిగూడలోని సీసీ షరాఫ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

మృతుడి భార్య కాత్యాయిని ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

నిరసనల వెనుక అంతర్జాతీయ నెట్‌వర్క్?

- ఫాక్స్ న్యూస్ నివేదికలో సంచలన ఆరోపణలు
- 9 దేశాల్లో 101 సంస్థల మధ్య పరస్పర సంబంధాలున్నాయని కథనం
- ఫ్రాన్స్ అల్లర్లు, భారత్‌లో సీఈసీకి వ్యతిరేక నిరసనల ప్రస్తావన
- ఇండియన్ అలయన్స్ పారిస్ పాత్రపై ప్రత్యేకంగా ప్రస్తావించిన నివేదిక
- నెవిల్ రాయ్ సింగమ్, కోడ్‌పింక్ సంస్థల పేర్లు కూడా వెల్లడి



అంతర్జాతీయ నిరసనల వెనుక పలు దేశాలకు విస్తరించిన సంస్థల నెట్‌వర్క్ ఉందంటూ ఫాక్స్ న్యూస్ ప్రచురించిన దర్యాప్తు కథనం చర్చకు దారితీసింది. ఫ్రాన్స్‌లో జరిగిన అల్లర్లు, భారత్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనల మధ్య సంబంధాలున్నాయని ఆ కథనం ఆరోపించింది. తొమ్మిది దేశాల్లోని 101 సంస్థలు నిరసనలకు మద్దతు ఇవ్వడం, వాటిని నిర్వహించడం, ప్రచారం చేయడంలో పరస్పరం సహకరించుకుంటున్నాయని పేర్కొంది.

ఫాక్స్ న్యూస్ సీనియర్ ఎడిటర్ అస్రా నోమానీ రూపొందించిన 'గ్లోబల్ ఖయాస్ ఇంక్ గ్రోస్ టు 101 గ్రూప్స్' నివేదికలో ఈ వ్యవస్థను 'రెడ్‌గ్రీన్ ప్రొటెస్ట్ ఎకోసిస్టమ్'గా అభివర్ణించారు. కమ్యూనిస్టు, ఇస్లామిస్ట్ భావజాలాలతో సంబంధాలున్నాయని నివేదిక పేర్కొన్న కొన్ని సంస్థలతో పాటు కార్మిక, విద్యార్థి సంఘాలు, ప్రచార నెట్‌వర్క్‌లు, మీడియా సంస్థలు కూడా ఈ వ్యవస్థలో భాగంగా ఉన్నాయని ఆరోపించింది. అమెరికా, బ్రిటన్, గ్రీస్, బ్రెజిల్, భారత్ సహా పలు దేశాలకు ఈ నెట్‌వర్క్ విస్తరించిందని తెలిపింది.

ఇండియన్ అలయన్స్ పారిస్‌పై దృష్టి

ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ అలయన్స్ పారిస్ (ఐఏపీ) సంస్థను నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఫ్రాన్స్, భారత్‌లోని నిరసనలకు సంబంధించిన సందేశాలను అనుసంధానించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఆరోపించింది. న్యూయార్క్‌లోని పీపుల్స్ ఫోరమ్‌తో నూ దీనికి భాగస్వామ్యం ఉన్నట్లు పేర్కొంది. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ అక్టోబరు 16న తన వెబ్‌సైట్‌లో ప్రచురించిన కథనంలో ఫ్రాన్స్, స్పెయిన్, భారత్, అల్బేనియాల్లో జరుగుతున్న నిరసనలను ఒకే సందర్భంలో ప్రస్తావించిన విషయాన్ని కూడా నివేదిక ఉదహరించింది.

విదేశీ నిధులపై ఆరోపణలు

యూరప్‌లోని నిరసనలకు కమ్యూనిస్టు భావజాలంతో సంబంధాలున్న సంస్థలు మద్దతు ఇస్తున్నాయని అస్రా నోమానీ నివేదిక పేర్కొంది. బ్రేక్‌త్రూ న్యూస్, కోడ్‌పింక్, పార్టీ ఫర్ సోషలిజం అండ్ లిబరేషన్ సంస్థల పేర్లను ప్రస్తావించింది. చైనాలో నివసిస్తున్న అమెరికాలో జన్మించిన వ్యాపారవేత్త నెవిల్ రాయ్ సింగమ్ ఈ సంస్థలకు నిధులు లేదా ఇతర రూపాల్లో మద్దతు అందిస్తున్నారని ఆరోపించింది.

కోడ్‌పింక్ వ్యవస్థాపకురాలు జోడీ ఇవాన్స్ అక్టోబరు 14న బ్రేక్‌త్రూ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫ్రాన్స్, స్పెయిన్, భారత్‌లో జరుగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చినట్లు నివేదిక తెలిపింది. ఐఏపీ కార్యదర్శి, భారత సంతతికి చెందిన జర్నలిస్టు జాయ్ బెనర్జీకి ఫ్రెంచ్ కార్మిక సంఘం సీజీటీతో గతంలో సంబంధాలు ఉండటంతో పాటు, ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీతోనూ అనుబంధం ఉందని కథనం ఆరోపించింది.

సీజేపీ నిరసనలతో సంబంధం లేదు

- .ఢిల్లీ హైకోర్టుకు నేహా బోరా వెల్లడి
- రూ.10 వేల వ్యక్తిగత బాండ్ నోటీసులపై హైకోర్టులో సవాల్
- హింసకు ప్రేరేపించలేదని న్యాయవాది వాదన
- ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు రద్దు చేయాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 22:

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన పిలుపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) అధ్యక్షురాలు నేహా బోరా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. తనను అదుపులోకి తీసుకున్న అనంతరం రూ.10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఆదేశిస్తూ జారీ చేసిన నోటీసులను ఆమె సవాల్ చేశారు. నేహా బోరా తరపున న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. ఆమె ఎలాంటి నేరానికి పాల్పడలేదని, హింసను ప్రేరేపించేలా పిలుపునివ్వలేదని కోర్టుకు వివరించారు.

తిరంగా యాత్ర సందర్భంగా అదుపులోకి

అక్టోబరు 16న తిరంగా యాత్ర సమయంలో ఢిల్లీలోని మండీ హౌజ్ వద్ద నేహా బోరాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు ఆమెను విడుదల చేశారు. అనంతరం అక్టోబరు 18న ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) నుంచి నోటీసులు అందాయి. రూ.10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించడంతో పాటు శాంతిభద్రతలను కాపాడాలని అందులో ఆదేశించారు. జంతర్ మంతర్‌ను నిరసన స్థలంగా ఉపయోగించకుండా ఆంక్షలు విధించినప్పటికీ, ప్రజలను కన్నాట్ ప్లేస్ వైపు వెళ్లేలా నేహా బోరా ప్రేరేపించారని నోటీసుల్లో ఆరోపించారు.

హింసకు పిలుపునివ్వలేదు

మండీ హౌజ్‌కు చేరుకున్న 10 నుంచి 15 నిమిషాల్లోపే నేహా బోరాను అదుపులోకి తీసుకున్నారని ఆమె న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ రోజు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యల్లో ఆమె పాల్గొనలేదని వాదించారు. మండీ హౌజ్‌లో సమావేశమవుదామని నేహా బోరా సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులో హింసకు పిలుపునిచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించే ఉద్దేశం కూడా ఆమె పోస్టులో కనిపించడం లేదని తెలిపారు.

ఆంక్షలు వర్తించవని వాదన

జంతర్ మంతర్ వద్ద విధించిన ఆంక్షలు మండీ హౌజ్ ప్రాంతానికి వర్తించవని నేహా బోరా తరపు న్యాయవాది వాదించారు. ఆమెపై ఎలాంటి తప్పిదాన్ని నిర్దిష్టంగా నిరూపించకుండా వ్యక్తిగత బాండ్ సమర్పించాలని ఆదేశించడం సరికాదని పేర్కొంటూ, ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని ఢిల్లీ హైకోర్టును కోరారు.



పెద్దపల్లిలో గొర్రెలు, మేకల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

శెనార్తి మీడియా, పెద్దపల్లి:



గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి పెద్దపల్లి జిల్లాలో మాంసం, చర్మాల ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. మారం తిరుపతి యాదవ్, జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఏవోతో పాటు పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 136లో సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని సంఘం నాయకులు తెలిపారు. ఈ స్థలాన్ని పరిశీలించి మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు గొర్రెలు, మేకల చర్మాలను శుద్ధి చేసి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆధునిక సాంకేతికతతో మాంసాన్ని శుభ్రంగా ప్రాసెస్ చేసి నిల్వ చేయడం, ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేపట్టే సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రతిపాదిత స్థలం సమీపంలోని మిషన్ భగీరథ పంపింగ్ వ్యవస్థ నుంచి లీకవుతున్న నీటి లభ్యతను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా పరిశ్రమల అవసరాలకు వినియోగించేలా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గొర్రెలు, మేకల పెంపకందారులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు లభించి ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సామ తిరుపతి యాదవ్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు దాడి చంద్రమౌళి యాదవ్, ప్రధాన కార్యదర్శి దాడి రవి యాదవ్, బొంపల్లి గ్రామ అధ్యక్షుడు దాడి లక్ష్మయ్య యాదవ్, తుర్కల మద్దికుంట గ్రామ అధ్యక్షుడు దాడి కనుకయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావాలను తట్టుకునే పంటలు సాగు చేయాలి

శెనార్తి మీడియా, శంకరపట్నం:



ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో పండే అపరాలు, నూనెగింజలు, ఇతర ఆరుతడి పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు నేస్తం ద్వారా ప్రారంభించిన 'ఖేత్ బచావో అభియాన్' అవగాహన కార్యక్రమాల్లో భాగంగా కేశవపట్నం రైతు వేదికలో మానకొండూర్ ఏడీఏ శ్రీధర్ ఆధ్వర్యంలో తొలి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి ఎల్‌నినో పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగం, పంటల సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శంకరపట్నం ఏఓ వెంకటేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, ఏఈఓలు స్రవంతి, కీర్తన, సునంద, ఆరతి, అర్చనతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవం

శెనార్తి మీడియా, సిద్దిపేట:



స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకభత్తిని వీరయ్య, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గురువారం సిద్దిపేటలో స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్.ఆర్. శంకరన్ జయంతి సందర్భంగా అంబేద్కర్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు కోడూరు స్వామి జెండా ఆవిష్కరించగా, స్వేరో గీతాలాపన నిర్వహించారు. ముఖ్య అతిథి, జిల్లా ఇన్‌చార్జి ఉప్పులేటి బాబు మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే సిద్ధాంతాలతో సమానత్వం, సామాజిక చైతన్యం, అభివృద్ధి సాధించడమే స్వేరోస్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులు చుంచు సుధాకర్, కోశాధికారి బాలస్వామి, అధికార ప్రతినిధి రామగల స్వామి, సీనియర్ స్వేరో తుండి సుజయ్, రామగిరి శివ, కొమ్ము మహేష్, ఎరుపుల ప్రదీప్, ఏర్పుల మధు, ఏర్పుల కుమార్, ఎరుపుల రాజు, ఏర్పుల సంజీవ్, కోడూరు జశ్వంత్, ఎరుపుల సిద్ధార్థ, ఎరుపుల రాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.42 వేలకు తగ్గకుండా నిర్ణయించాలి



శెనార్తి మీడియా, కరీంనగర్:

కార్మికులు, శ్రామికులు సృష్టిస్తున్న సంపదలో వారికి తగిన వాటా కల్పించాలని సీఐటీయూ కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అక్టోబరు 25, 26 తేదీల్లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ.. కనీస వేతనం నెలకు రూ.42 వేలకు తగ్గకుండా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. దేశ తలసరి ఆదాయం సుమారు రూ.2.40 లక్షలు కాగా, తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.19 లక్షలుగా ఉందని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో సగటున నలుగురు సభ్యులు ఉంటారని, దేశంలో సుమారు 45 కోట్ల మంది శ్రామికులు, కార్మికులు, రైతులు, వైట్ కాలర్ ఉద్యోగులు తదితర వర్గాలు సంపద సృష్టిస్తున్నాయని ముకుందరెడ్డి తెలిపారు. ఒక్కో శ్రామికుడు నెలకు సగటున రూ.80 వేలకుపైగా సంపద సృష్టిస్తున్నప్పటికీ, దేశంలో పనిచేస్తున్న 93 శాతం మంది శ్రామికులకు నెలకు కేవలం రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే ఆదాయం లభిస్తోందని అన్నారు. సంపద సృష్టించే శ్రామిక వర్గాలకు దానిలో న్యాయమైన వాటా దక్కాలని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, ఇతర శ్రామిక వర్గాలు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, జనగాం రాజమల్లు, జి. రాజేష్ పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని సందర్శించిన డీసీసీబీ అధికారులు



శెనార్తి మీడియా, సుల్తానాబాద్ :

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌తో పాటు అధికారులు, సిబ్బంది గురువారం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని (పీఏసీఎస్) సందర్శించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపారాలు, రుణాల పంపిణీ తీరును పరిశీలించారు. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, చిరు వ్యాపారులకు రుణాల పంపిణీని అధికారులు సమీక్షించారు. ఎరువులు, పురుగుమందుల విక్రయాలు, గోదాముల నిర్వహణ, పెట్రోల్ పంపు కార్యకలాపాలను పరిశీలించారు. సంఘం నిర్వహణ, కార్యకలాపాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డెవలప్‌మెంట్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, సింగిల్ విండో అధ్యక్షుడు గౌరవెల్లి మురళీధర్‌రావు, కార్యదర్శి వల్లకొండ రమేష్ సంఘం కార్యకలాపాలు, సేవల వివరాలను అధికారులకు వివరించారు. డీసీసీబీ సహకారంతో భవిష్యత్తులో ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టడంతో పాటు బంగారు రుణాల పంపిణీని ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు గౌరవెల్లి మురళీధర్‌రావు తెలిపారు. ఈ సేవలు అందుబాటులోకి వస్తే సంఘం ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

శెనార్తి మీడియా, సుల్తానాబాద్ :

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం తగ్గి, భూగర్భ జలమట్టాలు పడిపోయే అవకాశం ఉన్నందున రైతులు రాబోయే యాసంగి సీజన్‌లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సుల్తానాబాద్ మండల వ్యవసాయ అధికారి పైడితల్లి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ పరిస్థితులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. నువ్వులు, పెసర, మినుము, పొద్దుతిరుగుడు, వేరుశనగ, శనగ, జొన్న, మొక్కజొన్న పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయవచ్చని సూచించారు. నువ్వులు 80–85 రోజుల్లో, పెసర, మినుము 65–85 రోజుల్లో, పొద్దుతిరుగుడు 90–100 రోజుల్లో, వేరుశనగ 105–115 రోజుల్లో, శనగ 95–110 రోజుల్లో చేతికి వస్తాయని వివరించారు. పంట రకాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. మొక్కజొన్న, జొన్న పంటల్లో జోడు సాళ్ల పద్ధతిని అనుసరించడం ద్వారా నీటి వృథాను తగ్గించవచ్చని తెలిపారు. ఖాళీ స్థలంలో పెసర, మినుము, నువ్వులను అంతర పంటలుగా సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. వరి కోతల అనంతరం భూమిని దున్నకుండా పంటలు సాగు చేసే జీరో టిల్లేజ్ పద్ధతిని కూడా పరిశీలించాలని సూచించారు. రైతులు కీలక దశల్లో అవసరమైన నీటిని మాత్రమే వినియోగిస్తూ, సాగు ఖర్చులను తగ్గించుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని పైడితల్లి పేర్కొన్నారు. పంటల ఎంపిక, విత్తన రకాలు, సాగు పద్ధతులపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాడ వెంకటరెడ్డి

శెనార్తి మీడియా, శంకరపట్నం:



మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన మాడ వెంకటరెడ్డి బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి నియమితులయ్యారు. గురువారం జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ప్రకటించిన నూతన కార్యవర్గంలో ఆయనకు మరోసారి అవకాశం కల్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేస్తున్న వెంకటరెడ్డి యువజన నాయకుడిగా, శంకరపట్నం మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. గత ఏడాది జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్ఠానం మరోసారి అదే పదవిలో నియమించింది. ఈ నియామకంపై శంకరపట్నం మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి మాడ వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మొలంగూరులో ఘనంగా స్వేరోస్ డే వేడుకలు

శెనార్తి మీడియా, శంకరపట్నం:



మండలంలోని మొలంగూరు గ్రామంలో గురువారం ఎస్.ఆర్. శంకరన్ జయంతిని పురస్కరించుకుని స్వేరోస్ డే వేడుకలు నిర్వహించారు. స్వేరో నెట్‌వర్క్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, రాష్ట్ర నాయకుడు మాతంగి మారుతి ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాతంగి మారుతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జ్ఞాన సమాజ నిర్మాణం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సమాజ అభివృద్ధికి స్వేరోస్ నెట్‌వర్క్ కృషి చేయాలని సూచించారు. నెట్‌వర్క్ స్థాపనలో కీలక పాత్ర పోషించిన సుప్రీమ్ స్వేరో డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్.ఆర్. శంకరన్ జయంతి, స్వేరోస్ డే సందర్భంగా స్వేరోలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాతంగి మారుతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి విష్ణేష్, పీపీఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల స్వామి, స్వేరోస్ నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపు కాల్ పై పోలీసులకు ఫిర్యాదు

శెనార్తి మీడియా, శంకరపట్నం:

ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కొత్తగట్టు గ్రామానికి చెందిన కోరెం శ్రీనివాస్ రెడ్డి గురువారం కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 21న సాయంత్రం 6.43 గంటలకు 8309750197 నంబర్ నుంచి ఫోన్ చేసి, గ్రామ శివారులోని ప్లాట్‌లో హద్దురాళ్లు తొలగించారంటూ తనను బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో తన తల్లికి చెందిన ఫ్రిడ్జ్, గ్యాస్ సిలిండర్, బియ్యం బస్తాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, బ్యాంకు ఖాతా పుస్తకం కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంతో పాటు తాజా బెదిరింపు ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

పండుగ సాయన్నకు నివాళి



శెనార్తి మీడియా, శంకరపట్నం:

పండుగ సాయన్న 174వ జయంతిని పురస్కరించుకుని గురువారం కేశవపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పోలవేణి బిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. నిజాం పాలనలో భూస్వాముల దోపిడీ, ఆధిపత్యాన్ని ఎదిరించి పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పండుగ సాయన్న పోరాడారని నాయకులు పేర్కొన్నారు. పేదల పక్షాన నిలిచి అన్యాయాలను ఎదిరించిన ఆయనను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. ఆయన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేయడంతో పాటు సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడంపై ముదిరాజ్ సంఘాల నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో ..



శెనార్తి మీడియా, గన్నేరువరం:

మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్ కులస్తులు పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, పండుగ సాయన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడంపై ముదిరాజ్ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం సర్పంచ్ రంగనవేణి లచ్చి నర్సు ముదిరాజ్, పాకాల పరశురాం ముదిరాజ్, బోయినీ బాలయ్య ముదిరాజ్‌తో పాటు పలువురు కులస్తులు పాల్గొన్నారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి న్యాయపతి కామేశ్వరి

నేడు రేడియో అక్కయ్య వర్ధంతి

న్యాయపతి కామేశ్వరి, రాఘవరావుల గురించి ఈ తరం వారికి ఎక్కువగా తెలియక పోవచ్చు. రేడియో ప్రధాన ప్రసార సాధనంగా, తెలుగు ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకు పోయిన రోజులలో రేడియో 'అక్కయ్య, అన్నయ్య'లుగా ప్రసిద్ధులైన వారిద్దరు, ఆంధ్ర బాలానంద సంఘం పేరుతో 1939-40 నుండి 1955-56 ప్రాంతం వరకు మద్రాసు, ఆ తరువాత హైదరాబాదు నుండి తెలుగులో బాలల సాహిత్యానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ప్రత్యేకంగా వాళ్లిద్దరు కలిసి చేసిన రేడియో కార్యక్రమాలు కొన్ని అజామరాలుగా నిలిచి పోయాయి. వారు రాసి కొంత వరకు బాణీలు కట్టిన కొన్ని పాటలు కంప్యూటర్.ఎం.వి సంస్థ ద్వారా రికార్డులుగా వెలువడ్డాయి. రేడియో అక్కయ్యగా పేరుపొందిన న్యాయపతి కామేశ్వరి (1908 - 1980) విజయ నగరంలోని 1908లో పండితుల, విద్వాంసుల కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత విశాఖపట్నం లోని క్వీన్ మేరీ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు. తిరిగి విజయనగరం మహారాజా కళాశాలలో డిగ్రీ 1932లో పూర్తిచేశారు. ఆ కాలంలో బి.ఎ. ఉత్తీర్ణులైన మొట్టమొదటి మహిళ ఆమే. తరువాత కొంతకాలం నూజివీడు ఎస్టేటులో కపిలేశ్వరపురం జమిందారిణి జగదీశ్వరమ్మలు ఇంగ్లీషు నేర్పారు. 1934లో న్యాయపతి రాఘవరావును వివాహం చేసుకున్నారు. తరువాత 1937లో మద్రాసులోని వెల్లింగ్టన్ టీచర్ ట్రైనింగ్ కాలేజీ లో ఉపాధ్యాయ శిక్షణ (ఎల్.టి.) పూర్తిచేశారు. ఇద్దరి అభిప్రాయాలు కలియడంతో భర్తకుతోడుగా, చెన్నై రేడియో కార్యక్రమాలలోను, బాల పత్రిక నిర్వహణలోను ఆమె చురుగ్గా పాల్గొన్నారు. చెన్నై ఆకాశవాణి కేంద్రం వారు ఆటవిడుపు పేరుతో పిల్లల కార్యక్రమ నిర్వహణ చేపట్టి, ఆ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను న్యాయపతి దంపతులకు అప్పగించారు. ఆ విధంగా ఆమె రేడియో అక్కయ్యగా స్థిర పడి పోయారు. రాఘవరావు ఈమెతో పాటుగా రేడియో కార్యక్రమాన్ని నిర్వహిస్తూం డటంతో, ఆయనకు రేడియో అన్నయ్యగా పేరొచ్చింది. తరువాత ఈ కార్యక్రమం బాలానందంగా రూపాంతరం చెంది ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా పలు సంవత్సరాలు వారిద్దరిచే నిర్వహించడం జరిగింది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో న్యాయపతి కామేశ్వరి స్త్రీల కార్యక్రమాలకు ప్రయోక్తగా పని చేసేవారు. ఆకాశవాణి హైదరాబాద్ లో పనిచేస్తున్న కామేశ్వరి రేడియోకు అటు పత్రికలకు, రంగస్థలానికి అనేక నాటికలు, కథలు, గేయాలు రాసేవారు. చాలా మంది బాలలను నటులగా, కళాకారులుగా తీర్చిదిద్దారు. అనేక పల్లె ప్రాంతాలలో రేడియో మహిళా మండలలు ఏర్పాటు కావడానికి కృషి చేశారు. పేద మధ్య తరగతి మహిళల అభ్యున్నతికి పాటుపడిన స్త్రీ న్యాయపతి కామేశ్వరి. ఆనాటి కేంద్ర ప్రసారశాఖ మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ప్రశంసలను కూడా ఈమె అందుకున్నారు. బొమ్మల కొలువులు ఉత్సవాలు విహార యాత్రలు నిర్వహించే వారు. సామాజిక స్పృహ కలిగించేవిగా ఉండే ఆమె రచనలలో సహజత్వం ఉట్టిపడేలా ఉండి, సజీవ రూపాలుగా రూపు దిద్దు కున్నవి. కథలు బాలలకు సులభంగా అర్థమై పోతాయి. ఈమె రాసిన కథల్లో " అనగనగా ఆకలి కథ, ఇల్లు ఇరకాటం, ఆ చంద్రం, దోమ కోతి, తాత అవ్వ కథ, అమ్మమ్మ బహుమానం, " కోతి చేష్టలు", నాలుగు ఏనుగుల కథలు ముఖ్యమైనవి. కామేశ్వరి వ్రాసే నాటికలలో ఉన్న పాత్రలు అన్నీ ఆడపిల్లల పాత్రలే ! పిల్లలను చేరదీసి మంచి అలవాట్లు ఏవో, చెడు అలవాట్లు ఏవో కామేశ్వరి విడ మరిచి చెప్పేవారు. ఆంధ్ర బాలానంద సంఘం కార్యక్ర మాల కోసం తన సొంత భవనాన్ని దారాదత్తం చేశారు. కామేశ్వరి ఆశయాల మేరకు మర్రి చెన్నారెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో జవహర్ బాల భవన్ ఏర్పాటు చేశారు. మండలి వెంకట కృష్ణారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కామేశ్వరరావు కోరిక మేరకు ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ స్థాపన జరిగింది. 1975లో తొలి అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన సందర్భంగా బాల సాహిత్యానికి చేసిన సేవలకు గాను ఆమెను ఘనంగా సత్కరించడమే గాక 1978లో "బాలబంధు" బిరుదుతో ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమీ వారు సత్కరించారు. 1981లో కామేశ్వరి రచనలను అన్నింటినీ కలిపి " భోగి పళ్ళు " అనే సంకలనంగా తెచ్చారు. బాలానంద మహోద్యమానికి భర్త న్యాయపతి రాఘవ రావుకు సర్వవిధాలా సహకరిం చిన కామేశ్వరి తన 72వ ఏట 1980 అక్టోబర్ 23వ తేదీన ఈ లోకం వదిలి వెళ్లారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


సాగేగుణం గల టంగ్‌స్టన్ ఆవిష్కర్త విలియం డి.కూలిడ్జ్

నేడు విలియం డి.కూలిడ్జ్ జయంతి

విలియం డి.కూలిడ్జ్ (అక్టోబరు 23 1873 - ఫిబ్రవరి 3 1975 అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త. సాగే గుణం కలిగిన టంగ్‌స్టన్ ఆవిష్కర్త. ఆయన ఎక్స్-కిరణం యంత్రాలపై అనేక ప్రయోగాలు చేశారు. ఆయన జనరల్ ఎలక్ట్రిక్ రీసెర్చ్ లాబొ రేటరీకి డైరక్టర్ గా పనిచేశారు, కార్పొరేషన్ కు ఉపాధ్యక్షునిగా కూడా ఉన్నారు. ఆయన "సాగే గుణం గల టంగ్‌స్టన్"ను అభివృద్ధి చేయడంలో ప్రసిద్ధి పొందారు. ఈ టంగ్‌స్టన్ విద్యుత్ బల్బులలో ముఖమైన భాగం.

కూలిడ్జ్ మసాచుసెట్ట్స్ యందలి హడ్సన్ సమీపంలోని ప్రదేశంలో జన్మించారు. ఆయన 1891 నుండి 1896 లో మసాచుసెట్ట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరే వరకు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివారు. లాబొరేటరీ





అసిస్టెంట్ గా పనిచేసిన సంవత్సరం తరువాత ఆయన జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళ్లారు. అక్కడ డాక్టరేట్లను పొందారు. ఆయన 1899 నుండి 1905 వరకు ఎం.ఐ.టి వద్ద రసాయన శాస్త్ర విభాగంలో గల ఆర్థర్ ఎ నోయ్స్ వద్ద రీసెర్చ్ అసిస్టెంట్ గా పని చేశారు.

సాగే గుణం గల టంగ్‌స్టన్ కూలిడ్జ్ 1905లో కొత్త పరిశోధనా ప్రయోగ శాలలో జనరల్ ఎలక్ట్రిక్స్ సంస్థ వద్ద పరిశోధకునిగా పని చేయుటకు వెళ్లారు. అక్కడ ఆయన అనేక ప్రయోగాలను నిర్వహించారు. ఆయన పరిశోధన విద్యుత్ బల్బులలో ఫిలమెంటుగా ఉపయోగించే లోహంగా "టంగ్‌స్టన్" ఉపయోగించుటకు దోహద పడింది. ఆయన టంగ్‌స్టన్ లో సాగేగుణం గలదానిని అభివృద్ధి చేసారు. ఈ పరిశోధన ఫలితంగా విద్యుత్ బల్బులోని ఫిలమెంటును సులువుగా తీగలుగా మలచవచ్చు. దానిని టంగ్‌స్టన్ ఆక్సైడు ద్వారా శుద్ధి చేయవచ్చు. 1911 మొదట్లో "జనరల్ ఎలక్ట్రిక్" ఈ క్రొత్త రకం ఫిలమెంట్ తో బల్బులను మార్కెట్ లో విడుదల చేసింది. దీని ఫలితంగా ఆ సంస్థకు ముఖమైన అదాయ వనరుగా ఈ బల్బుల అమ్మకం దోహద పడింది. ఆయన 1913 లో ఆయన క్రొత్త ఆవిష్కరణకు పేటెంట్ (ఖూచ1,082,933) కొరకు దరఖాస్తు చేసి పొందారు. అదే విధంగా 1928 లో యు.ఎస్. లోని కోర్టు తాను తయారుచేసిన 1913 లోని పేటెంట్ విలువైన ఆవిష్కరణగా గుర్తించింది.

ఎక్స్-కిరణ నాళం అభివృద్ధి

1913 లో ఆయన కూలిడ్జ్ నాళాన్ని ఆవిష్కరణ చేసారు. అభివృద్ధి చెందిన కాథోడుతో కూడిన ఎక్స్-కిరణ నాళం అనేక ఎక్స్ - కిరణ యంత్రాలలో ఉపయోగించడం వలన శరీరంలో చాలా అంతర భాగాలలో ఉన్న కాన్సర్ కణతులను కూడా కచ్చితంగా గుర్తించుటకు తోడ్పడింది. ఈ కూలిడ్జ్ నాళంలో టంగ్‌స్టన్ను ఫిలమెంట్ గా ఉపయోగిస్తారు. ఇలా ఉపయోగించుట వైద్యరంగం లోని రేడియాలజీ విభాగంలో ప్రముఖ అభివృద్ధికి దోహద పడింది. ఈ నాళం సంబంధిత ప్రాథమిక డిసైన్ ను ప్రస్తుతం కూడా ఉపయోగిస్తున్నారు. ఆయన మొట్ట మొదటి భ్రమణం చేసే ఆనోడు ఎక్స్-కిరణ నాళాన్ని ఆవిష్కరణ చేశారు. ఆయన 1913 లో యు.ఎస్. పేటెంట్ కోసం దరఖాస్తు చేసి 1916 లో పొందారు.

1914 లో అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆయనను రమ్‌ఫోర్డ్ ప్రైజ్ తో సత్కరించింది.
1927 లో అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ ఎడిసన్ మెడల్ ను పొందారు. ఈ మెడల్ ఆయన ప్రకాశించే విద్యుత్ కాంతి, ఎక్స్-కిరణాలు కళ సేవల" కు పొందారు.
1926 లో హోవార్డ్ ఎన్. పోట్స్ మెడల్, 1927 లో లూయిస్ ఇ.లెవీ మెడల్1939 లో ఫారడే మెడల్, 1944 లో ఫ్రాంక్లిన్ మెడల్ ,
1975 లో నేషనల్ ఇన్వెంటర్స్ హాల్ ఆఫ్ ఫేమ్ కు ఎంపిక కాబడినారు. ఈ ఎంపిక ఆయన తన 101 వ సంవత్సరంలో మరణించుటకు కొన్ని రోజుల ముందుగా న్యూయార్క్ లోని షెనెక్టడీలో పొందారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

వ్యంగ్య చిత్రకారులలో సాటి లేని మేటి ఆర్. కె.లక్ష్మణ్

నేడు ఆర్ కె లక్ష్మణ్ జయంతి

కార్టూన్ రంగ చరిత్రలో అనేక పాత్రలు సృష్టించ బడినా, ఆర్.కె.లక్ష్మణ్ సృష్టించిన సామాన్య మానవుడు (కామన్ మాన్) అనితర సాధ్యమైన ప్రాచుర్యం పొందడం విశేషం. లక్ష్మణ్ వేసిన దాదాపు అన్ని రాజకీయ వ్యంగ్య చిత్రాలలో కూడా ఆయన విశేష వూహా చిత్రమైన సామాన్య మానవుడు దర్శనమిస్తాడు. బట్టతల, కళ్ళజోడు, గళ్ళకోటుతో ఉండే వ్యక్తి ప్రధానమంత్రి కార్యాలయం నుండి, గ్రామ కార్యాలయం వరకూ అన్ని చోట్ల దర్శనమిస్తూ, అక్కడ జరుగుతున్న విచిత్ర విషయాలకు సాక్షిగా నిలుస్తూ, చక్కటి హావ భావ ప్రకటన మాత్రమే చేస్తూ, ఎన్నడూ ఒక్క మాటకూడ మాట్లాడక పోవడం గమనార్హం. ఈ సామాన్య వ్యక్తి కార్టూన్ పాత్ర ఎంత ప్రసిద్ధి చెందిందంటే, ముంబాయిలో వర్లీ సముద్ర తీరంలో, సామాన్య వ్యక్తికి ఒక లోహ విగ్రహం ప్రతిష్ఠించారు. భారతదేశంలో ఒక కార్టూన్ పాత్రకు ఒక విగ్రహం ఉండటం ఇదొక్కచోట మాత్రమే కావడం విశేషాల్లోకి విశేషం.

ఆర్.కె.లక్ష్మణ్ గా లబ్ధ ప్రతిష్ఠులైన రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ లక్ష్మణ్ (అక్టోబర్ 23 1924 - జనవరి 26 2015) భారత దేశంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యంగ్య చిత్రకారులలో ఒకరు. ముంబాయి నుండి ప్రచురించ బడే ఆంగ్ల దిన పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా లో ప్రతిరోజూ




వ్యంగ్య చిత్రాలు వేస్తూ ఉండేవారు. కొన్ని దశాబ్దాలనుండి ఒకే వార్తా పత్రికలో పనిచేస్తూ, తన కార్టూన్లకు ఒక ప్రత్యేకతను సంతరించు కున్నారు. ఆయన ముఖ్యంగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను వేస్తూ ఉండేవారు. లక్ష్మణ్ సృష్టించిన సామాన్య వ్యక్తి పాత్ర కార్టూన్ల చరిత్రలో అత్యంత పేరు తెచ్చుకున్న పాత్ర. రాజకీయ కార్టూన్లు వేసి భారత దేశంలో ఉన్న రాజకీయ నాయకులందరినీ ఆటపట్టించి, వారిమీద సద్విమర్శలు చేసి రాజకీయ రంగాన్ని సరైన పంధాలో నడిపించటానికి తనవంతు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కింది. లక్ష్మన్ అంటే, రాజకీయ నాయకులందరికీ గౌరవం, అంతకుమించి ఎనలేని ప్రేమ. 2003లో తీవ్ర అస్వస్థులై ఆసుపత్రిపాలైనప్పుడు, దేశంలోని హేమాహేమీలందరూ ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆదుర్దాతో తెలుసు కోవడమే కీఆకుండా, నాటి ఉపరాష్ట్రపతి భైరవ్ సింగ్ షేకావత్ తో సహా చాలా మంది ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు.

ఆర్కే లక్ష్మణ్ మైసూర్ నగరంలో ఒక తమిళ కుటుంబంలో జన్మించారు. తండ్రి పాఠశాల ప్రధానోపాధ్యయులు. లక్ష్మణ్ ఆరుగురు సంతానంలో చిన్నవాడు. ఆయన అన్నలలో ఒకరైన ఆర్.కె. నారాయణ్ మాల్గుడి డేస్ కథలు రచించిన ప్రముఖ ఆంగ్ల రచయిత కావడం యాదృచ్ఛికం. చిన్నతన నుండి లక్ష్మణ్ కు బొమ్మల పుస్తకాలు చూసే అలవాటు ఉండేది. ఆంగ్ల పత్రికలైన స్ట్రాండ్ (స్రీతీఅఒ), పంచ్ (స్రుబఅఎష్ట్ర), బైస్టాండర్ (దీఎఝ్ఝఅఒవతీ), వైడ్-వరల్డ్ (ఔఱఒవ ఔశీతీశ్రీఒ), టిట్ బిట్స్ (ఒఱఒ దీఱ్ఱం) వంటి బొమ్మల కార్టూన్ పుస్తకాలను, తాను చదవటం నేర్వకముందే చూసేవాడు. బొమ్మల పుస్తకాలు చూస్తూ, మెల్లిగా గీతలు గీస్తూ బొమ్మలు వెయ్యటం మొదలు పెట్టారు. నేల మీద, గోడల మీద, తలుపుల మీద, ఎక్కడ పడితే అక్కడ రకరకాల బొమ్మలు వేసేవారు. తన ఉపాధ్యాయులనూ వదలక వాటి చిత్రాలుకూడ వేసారు. తాను వేసిన బోధి వృక్షం ఆకు బొమ్మను టీచర్లు కూడా మెచ్చుకున్నప్పుడు తానొక చిత్రకారుడిగా తయారయ్యే అవకాశం ఉన్నదని భావించారు.

ఉన్నత పాఠశాల తరువాత, లక్ష్మణ్ బొంబాయి (ఇప్పటి ముంబాయి) లోని జె.జె ఇన్సిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్ లో చేరి బొమ్మలు వేయటం నేరుకోవటానికి, తన దరఖాస్తు చేశారు. కాని, ఆ పాఠశాల ప్రధాన అధికారి, అటువంటి బొమ్మలు వేసేవాడు తమ స్కూలులో విద్యార్థిగా ఉండ తగడు అని చేర్చుకోలేదని చెపుతారు.

అయితే లక్ష్మణ్ ఆ తర్వాత అదే పాఠశాల... ఏ పాఠశాలలో



దాని పక్కనే ఉన్న ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో కొన్ని దశాబ్దాల పాటు వారి కార్టూనిస్ట్‌గా ఉండి ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవటం ఆయన అకుంఠిత దీక్షకు నిదర్శనం. చివరకు మైసూర్ విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. చదివి పట్ట భద్రుడయి, చదువు కొనసాగిస్తూనే బొమ్మలు వేస్తూ , ఫ్రీలాన్స్ (స్వతంత్ర) చిత్రకారునిగా కొనసాగారు. ఆ కాలంలోనె "స్వరాజ్య" అన్న పత్రికలో కార్టూన్లు వేశారు. అలాగే, నారద అనే కార్టూన్ సినిమాకు కూడా బొమ్మలు వేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



ఆర్చరీలో శీతల్ దేవి అద్భుతం

పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం

నగోయా: శీతల్ దేవికి చేతులు లేవు. కానీ ఆమె ఆర్చరీలో దిట్ట. ఇండియన్ ఆర్చర్ శీతల్ దేవి.. ఏషియన్ పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం గెలిచింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్‌లోనూ ఆమె గోల్డ్ మెడల్ గెలుచుకున్నది. ఉత్కంఠంగా సాగిన ఫైనల్లో ఆమె సింగపూర్ అథ్లెట్ ఆలిమ్ నుర్ స్యాహిదాను ఓడించింది. తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్ టీమ్ గోల్డ్ మెడల్ గెలిచిన కొన్ని గంటల వ్యవధిలోనూ వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్ దేవి అద్భుత ప్రదర్శన ఇచ్చి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. 19 ఏళ్ల వరల్డ్ చాంపియన్ శీతల్ దేవి 142-139 స్కోరుతో ఆలిమ్‌పై విజయం సాధించింది. 2023 హాంగ్‌జూ గేమ్స్‌లోనూ ఆమె ఆలిమ్‌పైనే విక్టరీ కొట్టింది. ప్రస్తుత పారా గేమ్స్‌లో శీతల్ దేవి ఖాతాలో మొత్తం మూడు పతకాలు ఉన్నాయి. మహిళల డబుల్స్ సిల్వర్ కూడా గెలిచిందామె.



భళా సింధు..

పారిస్, అక్టోబర్ 22 : ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ సిరీస్‌లో పీవీ సింధు తొలిరౌండ్ అదరగొట్టింది. మహిళల సింగిల్స్ ఫస్ట్ రౌండ్‌లో సింధు 21-14, 8-21, 23-21తో థాయ్‌లాండ్ షట్లర్ సుపనిద కేట్‌థాంగ్‌పై గెలిచి రెండో రౌండ్‌కు చేరింది. నరాలు తెగే ఉత్కంఠ నడుమ గంటకు పైగా సాగిన పోరులో తొలి గేమ్‌ను ఈజీగానే గెలుచుకున్న ఈ తెలుగు తేజం.. రెండో గేమ్‌లో ప్రత్యర్థి పుంజుకోవడంతో వెనుకబడింది. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఆమె ఒక దశలో 8-19తో వెనుకంజలో ఉంది. ఈ స్థితిలో ఒక ప్లేయర్ వరుసగా పాయింట్లు సాధించి మ్యాచ్‌ను దక్కించుకోవడం అసాధ్యమే. కానీ సింధు మాత్రం దీనిని సుసాధ్యం చేసింది. ఆ దశలో ఏదో పూనకం వచ్చినట్టుగా ఆడిన సింధు.. వరుసగా 11 పాయింట్లు సాధించి 19-19తో స్కోర్లను సమం చేసింది. ఆ తర్వాత ఉత్కంఠ పోరులో 23-21తో గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, లక్ష్యసేన్ ఫస్ట్ రౌండ్‌కే నిష్క్రమించగా ఉన్నతి హుడా, దేవికా కూడా తొలిరౌండ్ విఘ్నాన్ని దాటలేకపోయారు.

హైదరాబాద్‌కు రెండో విజయం

ఆంధ్రాపై గెలుపుతో గ్రూప్-బీలో అగ్రస్థానం

విజయవాడ: రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో హైదరాబాద్ రెండో విజయాన్ని నమోదుచేసింది. ఎలైట్ గ్రూప్-బీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్.. ఆంధ్రాను 267 పరుగుల తేడాతో చిత్తుచేసి భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బౌలర్లు చెలరేగడంతో రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు బ్యాటర్లను 130 పరుగులకే కుప్పకూల్చింది. హైదరాబాద్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 275 రన్స్ చేయగా రెండో ఇన్నింగ్స్‌ను 306/7 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసి ఆంధ్రాను 184 రన్స్‌కే కట్టడిచేయడంలో కీలకపాత్ర పోషించిన స్పిన్ ఆల్‌రౌండర్ తనయ్ త్యాగరాజన్.. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ ఆరు (6/35) వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో గ్రూప్-బీలో హైదరాబాద్ 13 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది.



న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

4 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ!

- తొలి టీ20లో కివీస్‌కు షాకిచ్చిన టీమిండియా
- 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- 19.4 ఓవర్లలో 230 పరుగులు చేసి సంచలన విజయం
- 67 పరుగులతో చెలరేగిన సంజు శాంసన్
- చివర్లో నామన్ ధీర్ మెరుపులు.. 15 బంతుల్లోనే 42 పరుగులు
- వృథా అయిన గ్లెన్ ఫిలిప్స్ 82 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్



క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 22: న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు విజయంతో శుభారంభం చేసింది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టీ20లో ఆతిథ్య న్యూజిలాండ్‌పై భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో ఒక దశలో వరుస వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన టీమిండియా చివర్లో అద్భుతంగా పుంజుకుంది. సంజు శాంసన్ మెరుపు అర్ధశతకం, శ్రేయాస్ అయ్యర్ కీలక ఇన్నింగ్స్, నామన్ ధీర్ విధ్వంసక బ్యాటింగ్‌తో కివీస్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. న్యూజిలాండ్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 225 పరుగులు చేయగా, భారత్ 19.4 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. సీఫర్ట్ 17 బంతుల్లో 24 పరుగులు చేయగా, ఫిన్ అలెన్ 24 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 45 పరుగులు సాధించాడు. డారిల్ మిచెల్ 19 బంతుల్లో 28 పరుగులు చేశాడు. అనంతరం గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 40 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 82 పరుగులు చేసి న్యూజిలాండ్‌కు భారీ స్కోరు అందించాడు. బెవోన్ జాకబ్స్ 16 బంతుల్లో 31 పరుగులు జోడించడంతో కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 225 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో వికెట్ పడగొట్టారు. అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లలో 51 పరుగులు సమర్పించుకోగా, భువనేశ్వర్ కుమార్ 49 పరుగులు ఇచ్చాడు. 226 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అభిషేక్ శర్మ కేవలం 12 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 పరుగులు చేసి కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరోవైపు సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 33 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 67 పరుగులు చేసి లక్ష్య ఛేదనకు బలమైన పునాది వేశాడు. అయితే అభిషేక్ శర్మ ఔటైన తర్వాత భారత ఇన్నింగ్స్‌లో అనూహ్య మలుపులు చోటుచేసుకున్నాయి. సంజు శాంసన్ 67 పరుగుల వద్ద పెవిలియన్ చేరగా, తిలక్ వర్మ ఆరు పరుగులకే ఔటయ్యాడు. ఇషాన్ కిషన్ కూడా ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. దీంతో భారత్ ఒక దశలో 122 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. వరుస వికెట్ల పతనంతో కష్టాల్లో పడిన భారత జట్టును కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్ ఆదుకున్నారు. వీరిద్దరూ సమయోచితంగా బ్యాటింగ్ చేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. శ్రేయాస్ అయ్యర్ 28 బంతుల్లో 42 పరుగులు చేయగా, అక్షర్ పటేల్ 14 బంతుల్లో 24 పరుగులు సాధించాడు. ఈ ఇద్దరి కీలక భాగస్వామ్యంతో భారత్ తిరిగి విజయంపై ఆశలు పెంచుకుంది. అయితే అక్షర్ పటేల్, శ్రేయాస్ అయ్యర్ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో మ్యాచ్ మరోసారి ఉత్కంఠగా మారింది. చివరి ఓవర్లలో భారత విజయానికి వేగంగా పరుగులు అవసరమైన పరిస్థితి ఏర్పడింది. మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా మారిన సమయంలో నామన్ ధీర్ క్రీజులో నిలబడి అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శించాడు. న్యూజిలాండ్ బౌలర్లపై ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఎదురుదాడికి దిగాడు. కేవలం 15 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 42 పరుగులు చేసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. చివరి వరకు క్రీజులో నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. నితీశ్ కుమార్ రెడ్డి రెండు పరుగులతో నాటౌట్‌గా నిలిచి అతడికి సహకరించాడు. దీంతో భారత్ 19.4 ఓవర్లలో ఆరు వికెట్లకు 230 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారీ స్కోరు నమోదు చేసినప్పటికీ భారత బ్యాటర్ల దూకుడు ముందు న్యూజిలాండ్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. తొలి టీ20లో ఉత్కంఠ విజయంతో భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనను విజయవంతంగా ప్రారంభించింది.

ఆస్ట్రేలియా ఓడినా అగ్రస్థానం పదిలం!

దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో కంగారూలకు ఓటమి ముప్పు



సెయింట్ జార్జ్ పార్క్, అక్టోబర్ 22 : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఓటమి అంచున నిలిచినా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆ జట్టు అగ్రస్థానానికి ఎలాంటి ముప్పు లేకపోవడం విశేషం. సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా విజయానికి చేరువైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసి ఇంకా 170 పరుగులు వెనుకబడి ఉంది. చివరి రోజు దక్షిణాఫ్రికా బౌలర్లను ఎదుర్కొని మ్యాచ్‌ను కాపాడుకోవడం కంగారూలకు సవాల్‌గా మారింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. మార్కో జాన్సన్, సైమన్ హార్మర్ కూడా రాణించడంతో ఆ జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి కేవలం 99 పరుగులకే కుప్పకూలింది. మార్కో జాన్సన్ ఐదు వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. దీంతో ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 326 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. భారీ ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా ఆస్ట్రేలియాను ఫాలోఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ కంగారూలు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లకు 156 పరుగులు మాత్రమే చేయగలిగారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఇంకా 170 పరుగులు వెనుకబడి ఉంది. ట్రావిస్ హెడ్ సెంచరీకి చేరువలో ఉండగా, స్టీవ్ స్మిత్ వంటి స్టార్ బ్యాటర్లు ఇంకా రావాల్సి ఉంది. అయితే దక్షిణాఫ్రికా పటిష్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొంటూ చివరి రోజు మొత్తం క్రీజులో నిలవడం ఆస్ట్రేలియాకు కత్తిమీద సాములా మారింది. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 81.82 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా 60 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధిస్తే ఆ జట్టు పాయింట్ల శాతం పెరిగినప్పటికీ మూడో స్థానంలోనే కొనసాగుతుందని అంచనా. ఆస్ట్రేలియా ఓడిపోయినా 75 శాతం పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటుంది. ఒకవేళ మ్యాచ్ డ్రాగా ముగిసినా రెండు జట్ల పాయింట్ల శాతాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే ఆస్ట్రేలియా మొదటి స్థానంలో, దక్షిణాఫ్రికా మూడో స్థానంలోనే కొనసాగనున్నాయి. ప్రస్తుతం అందించిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక వివరాల ప్రకారం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ రెండో స్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా మూడో స్థానంలో, బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో ఉన్నాయి. భారత జట్టు ఐదో స్థానంలో ఉండగా, ఇంగ్లండ్ ఆరో స్థానంలో కొనసాగుతోంది. దీంతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఫలితం ఎలా ఉన్నా అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీతో హ్యారీ బ్రూక్ విధ్వంసం

శ్రీలంకపై ఇంగ్లాండ్ రికార్డుల మోత!



రావల్పిండి/హైదరాబాద్, అక్టోబర్ 22: పాకిస్థాన్ వేదికగా రావల్పిండిలో జరుగుతున్న వన్డే ట్రై సిరీస్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. శ్రీలంకతో జరుగుతున్న మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుతమైన ద్విశతకంతో విరుచుకుపడటంతో ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగుల కొండంత స్కోరు సాధించింది. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కేవలం 116 బంతుల్లోనే 21 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో 174.13 స్ట్రైక్‌రేట్‌తో 202 పరుగులు చేసి మ్యాచ్ చివరి బంతికి నిష్క్రమించాడు. దీనితో వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా బ్రూక్ రికార్డు పుటలకెక్కిడు. బ్రూక్ మొదటి సెంచరీకి 75 బంతులు తీసుకోగా, ఆ తర్వాత కేవలం 36 బంతుల్లోనే రెండో సెంచరీ పూర్తి చేయడం విశేషం.

జో రూట్, విల్ జాక్స్ అర్ధసెంచరీలు:


బ్రూక్‌కు తోడుగా ఇంగ్లాండ్ బ్యాటర్లందరూ దాడికి దిగారు. విల్ జాక్స్ కేవలం 30 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 66 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, జో రూట్ 66 బంతుల్లో 69 పరుగులు చేశాడు. ఓపెనర్లు టామ్ బాంటన్ (50), బెన్ డకెట్ (29) కూడా జట్టుకు మంచి శుభారంభాన్ని ఇచ్చారు. చివరి 5 ఓవర్లలో ఇంగ్లాండ్ బ్యాటర్లు ఏకంగా 78 పరుగులు పిండుకోవడంతో శ్రీలంక బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లాలాగే 2 వికెట్లు తీయగా, అసిత ఫెర్నాండో, జనిత్ లియానాగే చెరో వికెట్ సాధించారు. శ్రీలంక ముందు ఇప్పుడు 430 పరుగుల భారాత్మక లక్ష్యం ఉంది.



భాగ్యశ్రీ గ్లామర్ మెరుపులు

తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మరోసారి గ్లామరస్ లుక్‌తో సందడి చేశారు. సాయి అభ్యంకర్‌తో కలిసి ఆమె నటించిన బ్రేకప్ సాంగ్ 'రాధిమా' ఇప్పటికే 10 కోట్ల వ్యూస్‌కు చేరువవుతూ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. తాజాగా భాగ్యశ్రీ ధరించిన వైన్ మెరూన్ రంగు శాటిన్ గౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆఫ్‌షోల్డర్ నెక్‌లైన్, నడుము భాగంలో ముడతల డిజైన్, కిందివైపు సున్నితంగా పరుచుకున్న చిఫాన్ ఫ్యాబ్రిక్‌తో ఈ దుస్తులు ఆమెకు అందమైన రూపాన్ని అందించాయి. హై స్లిట్‌తో కూడిన గౌన్‌కు చిన్న పెండెంట్, చెవిపోగులు, మెరిసే చెప్పులు జతచేశారు. జుట్టును పైకి ముడివేసి సరికొత్త స్టైలింగ్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. శివకార్తికేయన్ సరసన తమిళ చిత్రం 'సేయోన్'లో భాగ్యశ్రీ నటించనున్నారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో పాటు, ఆమె నటిస్తున్న మలయాళ సినిమా 'ఆపరేషన్ గంగా' కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది





సంప్రదాయ చీరకట్టులో శ్రీలీల సందడి

టాలీవుడ్‌లో తనదైన నటన, అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి శ్రీలీల మరోసారి సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ఆవిడ ధరించిన చీరకట్టు అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ధమాకా', 'భగవంత్ కేసరి' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. 'కిస్సిక్' పాటతో దేశవ్యాప్తంగా మరింత పాపులారిటీ సంపాదించారు. ఈసారి శ్రీలీల ఆవాల పసుపు రంగు రఫుల్స్ చీరలో కనిపించారు. అద్దాల అలంకరణతో కూడిన అంచులు, చిన్న పూల డిజైన్లు చీరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బంగారు రంగు ఎంబ్రాయిడరీతో రూపొందించిన స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేసింది. విరబోసిన జుట్టు, సహజమైన మేకప్‌తో సంప్రదాయానికి ఆధునిక శైలిని జోడించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న హిందీ రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో శ్రీలీల నటించనున్నారు. మరోవైపు, అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్ నటించనున్న సినిమాలోనూ ఆమె భాగం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది.




ఆరెంజ్ డ్రెస్‌లో ఫొజీ భామ క్యూట్ లుక్

డ్యాన్స్ రీల్స్‌తో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇమాన్వీ.. తన అందం, హావభావాలతో నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే భారీ సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్న ఈ భామ.. వెండితెరపై అడుగుపెట్టకముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా ఇమాన్వీ ఆరెంజ్ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్‌లో మెరిశారు. స్క్వేర్ నెక్‌లైన్, కిందివైపు విస్తరించిన డిజైన్‌తో ఉన్న ఈ దుస్తులకు జుట్టులో తెల్లని రిబ్బన్, గోల్డ్ హూప్ చెవిపోగులు జతచేశారు. పలుచని లేయర్డ్ నెక్లెస్, ఉంగరం, బ్రేస్‌లెట్‌తో తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. సహజమైన మేకప్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇమాన్వీ సినీ రంగ ప్రవేశం ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ఫౌజీ' చిత్రంతో జరగనుంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి చిత్రంతోనే వెండితెరపై ఇమాన్వీ ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రూటు మార్చిన స్వీటీ..

లేడీ ఓరియెంటెడ్ కథలకు గ్యాప్!



టాలీవుడ్ కథానాయిక అనుష్క శెట్టి (స్వీటీ) తన కెరీర్ ప్లానింగ్‌ను పూర్తిగా మార్చేసింది. 'భాగమతి' తర్వాత కేవలం లేడీ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తూ వచ్చిన స్వీటీకి, ఇటీవల వచ్చిన 'ఘాటి' చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ మిగిల్చింది. దాంతో సోలోగా సినిమా భారాన్ని మోసే ఫార్ములాను పక్కనపెట్టి, భారీ తారాగణం ఉండే పెద్ద ప్రాజెక్టుల వైపు ఆమె చూపు తిప్పినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మలయాళ స్టార్ హీరో జయసూర్య నటిస్తున్న భారీ ఫాంటసీ థ్రిల్లర్ 'కథనార్'లో అనుష్క 'నీలి' అనే కీలక పాత్ర పోషిస్తోంది. రీసెంట్‌గా వచ్చిన ట్రైలర్‌లో తన లుక్‌తో మంచి బజ్ క్రియేట్ చేసింది. సోలో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, ఇలాంటి క్రేజీ మల్టీస్టారర్ కాన్సెప్ట్‌లతో మళ్లీ కమర్షియల్ ట్రాక్‌లోకి రావాలని అనుష్క భావిస్తోంది. త్వరలోనే ఆమెను మళ్లీ స్టార్ హీరోల సరసన చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**